
బస్సులోనే అల్పాహారం తింటున్న కార్యకర్తలు

అమరావతి రాజధాని పునర్నిర్మాణ సభకు జిల్లా నుంచి భారీగా జనం


అమరావతి వెళ్లే బస్సులను ఒంగోలులో జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్

ఉత్సాహం.. ఉత్తేజం

మండుటెండను లెక్కజేయకుండా వెళ్లిన కూటమి శ్రేణులు

అమరావతి పునర్నిర్మాణ ఉత్సవానికి జనం పోటెత్తారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కూటమి పార్టీల శ్రేణులు శుక్రవారం ఉదయం నుంచే తరలివెళ్లారు. ఇళ్ల వద్ద నుంచి ఉత్సాహంగా బయల్దేరి వెళ్లి సభలో ఉల్లాసంగా పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, రాజధాని నిర్మాణానికి కేంద్రం పూర్తిగా అండగా ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించడం పట్ల సభకు హాజరైన శ్రేణులు, నేతలు హర్షం వ్యక్తం చేశారు. మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల ప్రసంగాలను విని, సభ జరిగిన తీరును చూసి అత్యధికులు ఉత్తేజం పొందడంతోపాటు రాజధానిగా అమరావతికి ఇక ఢోకా లేదన్న విశ్వాసం వ్యక్తం చేశారు.

ఒంగోలు మే 2 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభ సభకు జిల్లా నుంచి భారీగా ప్రజానీకం తరలివెళ్లింది. మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా కూటమి ప్రభుత్వంలోని మూడు పార్టీల శ్రేణులు వేలాదిగా అక్కడికి వెళ్లి పాల్గొన్నారు. అందులో తెలుగు తమ్ముళ్లు ఎక్కువ మంది.. జనసేన, బీజేపీ కార్యకర్తలు కూడా ఉన్నారు. అదేసమయంలో ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్ర అభివృద్ధికి ఇక్కడ ప్రభుత్వం చేస్తున్న కృషిని, ప్రత్యేకించి సీఎం

మిగతా 6వ పేజీలో



- పలుచోట్ల బస్సులను జెండా ఊపి ప్రారంభించిన కీలక ప్రజాప్రతినిధులు
- రాజధాని అమరావతిపై విశ్వాసం
- సీఎస్‌పురం నుంచి సింగరాయకొండ వరకు నిర్మించిన ఎన్‌హెచ్‌ని ప్రారంభించిన మోదీ
- త్రోవగుంట నుంచి ట్రాఫిక్ మళ్లింపు
- పొరుగు జిల్లాల ప్రజలకు ఆతిథ్యం

పీడీసీసీబీకి సీతారామయ్య!

డీసీఎంఎస్‌కు శ్యామల కాశిరెడ్డి?


డాక్టర్ సీతారామయ్య

- పర్చూరు నుంచి పరిశీలనలో కొందరి పేర్లు
- మూడ్రోజుల తర్వాత ఉత్తర్వులు వచ్చే అవకాశం
- వీరయ్య కుటుంబానికి చేయూతగా అధిష్ఠానం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాస్థాయిలోని నామినేటెడ్ పదవుల భర్తీకి ప్రభుత్వం శ్రీకారం పలకబోతోంది. అందులో భాగంగా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) పర్సన్ ఇన్‌చార్జిగా డాక్టర్ కామేపల్లి సీతారామయ్యను, జిల్లా సహకార మార్కెట్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్‌గా శ్యామల కాశిరెడ్డిలను నియమించబోతున్నట్లు తెలిసింది. ఆమేరకు సోమవారం తర్వాత ఎప్పుడైన ఉత్తర్వులు రావచ్చనేది సమాచారం. అయితే ఈ రెండు పదవులకు పర్చూరు నియోజకవర్గానికి చెందిన కొందరి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. కొత్త జిల్లాల ఏర్పాటు అనంతరం సెంట్రల్ బ్యాంక్, డీసీఎంఎస్, వక్ఫ్ బోర్డు, గ్రంథాలయం లాంటి సంస్థలతోపాటు జిల్లా పరిషత్ కూడా ఉమ్మడి జిల్లాల పరిధిలోనే పనిచేస్తున్నాయి. వీటికి సంబంధించిన జిల్లాస్థాయి నామినేటెడ్ పదవులన్నీ ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులను దాదాపుగా పూర్తిచేసిన ప్రభుత్వం ఇటీవల జిల్లాస్థాయి నామినేటెడ్ పదవులు, అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీల నియామకాలకు శ్రీకారం పలికింది. జిల్లాలో సుమారు పది మార్కెట్ కమిటీల

మిగతా 6వ పేజీలో



805 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు

- హెచ్‌ఎంలుగా స్కూల్ అసిస్టెంట్లు
- 500 మంది టీచర్ల సర్దుబాటు

ఉమ్మడి జిల్లాలో పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా 805 ఆదర్శ ప్రాథమిక స్కూళ్లు ఏర్పాటవుతున్నాయి. వీటన్నింటికీ ప్రధానోపాధ్యాయుల పోస్టులను కేటాయించారు. వీటిలో 500 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎంలుగా జిల్లాలో మిగులుగా తేలిన స్కూల్ అసిస్టెంట్లను నియమించనున్నారు. ఈమేరకు కేటాయింపు పూర్తయింది. దీనికి పాఠశాల విద్య కమిషనర్ కార్యాలయ ఆమోదముద్ర కూడా లభించింది.

ఒంగోలు విద్య, మే 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ విద్యా విధానంలో భాగంగా గత ప్రభుత్వం 117 జీవోను అమల్లోకి తెచ్చింది. అందులో భాగంగా 3, 4, 5 తరగతులను హైస్కూళ్లలో విలీనం చేసి స్కూలు అసిస్టెంట్లతో బోధించేందుకు చర్యలు తీసుకుంది. దీని కోసం ప్రతి హైస్కూలుకు అదనంగా ఇంగ్లీషు, గణితం పోస్టులను మంజూరు చేసి ప్రమోషన్ల ద్వారా వాటిని భర్తీ చేశారు. అయితే ఉపాధ్యాయ సంఘాలు, టీచర్లు ఈ జీవోను, హైస్కూళ్లలో 3, 4, 5 తరగతుల విలీనాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. వారికి మద్దతుగా జీవోను రద్దుచేస్తామని ఎన్నికల సమయంలో కూటమి హామీ ఇచ్చింది. ఆ మేరకు నూతన ప్రభుత్వం అధికారంలోకి రాగానే 117జీవోను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ క్రమంలో పాఠశాలల పునర్ వ్యవస్థీకరణకు పూనుకుంది. పంచాయతీకొక మోడల్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేసి 1 నుంచి 5 తరగతులకు తరగతికి ఒకరు చొప్పున ఐదుగురు టీచర్లను నియమిస్తామని ప్రకటించా రు. ఈ పాఠశాలలకు హెచ్‌ఎం పోస్టును మంజూరు చేస్తామని చెప్పింది.

59 మంది విద్యార్థులుంటే ఆదర్శ స్కూలు

పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా జిల్లాలో 805 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు (మోడల్ ప్రైమరీ స్కూళ్లు) ఆవిర్భవించనున్నాయి. 1 నుంచి 5 తరగతులకు కనీసం 59 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలను ఆదర్శ స్కూళ్లుగా గుర్తించారు. కొన్నిచోట్ల 45మంది విద్యార్థులు ఉన్నా వచ్చే ఏడాది సంఖ్య పెంచుతామని హామీ ఇస్తే వాటిని కూడా మోడల్ స్కూళ్లుగా గుర్తించారు. ఆదర్శ పాఠశాలల్లో కనీసం 59 మంది విద్యార్థులు ఉంటే వాటికి ప్రైమరీ స్కూలు హెచ్‌ఎం పోస్టు, మూడు సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు కేటాయించారు. ఈక్రమంలో జిల్లాలో 805 ఆదర్శ పాఠశాలలు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. వీటిలో 670ని గుర్తించారు. యూపీ స్కూళ్లను ప్రాథమిక పాఠశాలలుగా డౌన్‌గ్రేడ్ చేయడం ద్వారా 44, ఒకే ఆవరణలో హైస్కూలు, ఎలిమెంటరీ స్కూలు ఉన్నచోట 15, హైస్కూ లుగా అప్‌గ్రేడ్ అయిన 75 యూపీ స్కూళ్ల లో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు ఏర్పా టు చేశారు. ఆదర్శ పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా స్కూలు అసిస్టెంట్లను నియమిస్తున్నారు. యూపీ స్కూళ్లలో 6, 7, 8 తరగతులకు

మిగతా 6వ పేజీలో

కదులుతున్న బోగస్ డొంక..!

ఆన్‌లైన్ రుసుం పేరుతో ఎస్టీలను మోసం చేసిన ఆర్పీ

- పురుష గ్రూపుల రుణాల్లోనూ చేతివాటం
- 56 సంఘాలపై విచారణ కమిటీని నియమించిన మెప్మా పీడీ



ఒంగోలు, కార్పొరేషన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో బోగస్ గ్రూపులను సృష్టించి రూ.కోట్లు దోచుకున్న అవినీతి ఆర్పీలపై చర్యలు తీసుకునేందుకు మెప్మా పీడీ సిద్ధమయ్యారు. గడిచిన మూడు నెలల్లో నగరంలో బ్యాంకుల ద్వారా పొందిన రుణాలు ఎన్ని? ఏఏ గ్రూపుల వారు తీసుకున్నారు? అసలు ఎన్ని.. బోగస్ ఎన్ని? అన్న దానిపై క్షేత్రస్థాయి నుంచి విచారణకు సిద్ధమయ్యారు. అందుకోసం నలుగురు ఉద్యోగులను నియమించారు. అయితే అధికారుల వద్ద ప్రాథమికంగా కొంత సమాచారం ఉంది. మరింత లోతుగా విచారణకు సిద్ధమయ్యారు. ఇప్పటికే కేశవస్వామి పేటకు చెందిన యానాది సామాజికవర్గానికి చెందిన 14 పొదుపు సంఘాలు తమకు జరిగిన అన్యాయంపై రోడ్డెక్కి నిరసన

మిగతా 6వ పేజీలో

పిడుగుపాటుకు 14 మేకలు మృతి


పిడుగుపాటుకు మృతి చెందిన మేకల వద్ద దిగాలుగా కూర్చొని ఉన్న శివపార్వతి

కనిగిరి, మే 2 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు 14 మేకలు మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలోని కలగట్ల గ్రామంలో చోటుచేసుకుంది. వేకువజామున గంటపాటు ఉరుములు, మెరుపులతో, గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో ప్రజలు బయటికి వచ్చేందుకు భయపడ్డారు. ఈ క్రమంలో కలగట్ల గ్రామంలోని నూకతోటి శివపార్వతి నివాసానికి సమీపంలో పిడుగులు పడ్డాయి. దీంతో వారి చావిడిలో ఉన్న 14 మేకలు మృతి చెందాయి. వీటి విలువ దాదాపు లక్షన్నర ఉంటుందని బాధితురాలు వాపోయారు. ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని కోరుతున్నారు.


వాటర్ యాపిల్ చెట్టును చూపిస్తున్న రఘుప్రసాద్‌రెడ్డి

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి.. ప్రకృతి సాగువైపు కదిలి..

- యువ రైతు ఆదర్శ వ్యవసాయం
- పండ్ల తోటల పెంపకంపై మక్కువ
- ఆరోగ్యకర సమాజ నిర్మాణమే లక్ష్యం
- సేంద్రియ ఎరువులు.. కుళ్లిన పండ్లు పంటకు వినియోగం
- ఏడాదికి రూ.10లక్షలపైన ఆర్జన

7లో

వామ్మో పులి

- అర్ధవీడు మండలంలో సంచారం
- భయాందోళనలో ప్రజలు
- అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌వో సూచన

7


ఒంగోలులో చిత్రలేఖనం నేర్చుకుంటున్న చిన్నారులు

వినోదం.. వికాసం

- వేసవి సెలవుల్లో చిన్నారుల కోసం సమ్మర్ క్యాంపులు
- క్రీడలు, డ్యాన్స్, సంగీతం, చిత్రలేఖనం శిబిరాల ఏర్పాటు
- పిల్లలు పలు రంగాల్లో రాణించేలా ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు

7

మైనారిటీలకు ఊరట



రూ.12.05 కోట్ల రుణాలు.. 782 మంది లబ్ధిదారులు

దరఖాస్తుకు 25 ఆఖరు తేదీ

ఒంగోలు నగరం, మే 2 (ఆంధ్రజ్యోతి) : పథకాలు నిలిచిపోయి గత ఐదేళ్లుగా దాదాపు మూతపడిన మైనారిటీ కార్పొరేషన్‌కు రాష్ట్రప్రభుత్వం జవసత్వాలు చేకూర్చింది. రుణాల కోసం నిరుద్యోగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. మైనారిటీతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లలో 2019 వరకు అమలవుతున్న దాదాపు అన్ని పథకాలను గత వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. ఆయా సంస్థలను బోర్డులకే పరిమితం చేసేసింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక బడుగులకు ఊపిరిపోసింది. ఇప్పటికే ఎస్సీ నిరుద్యోగులకు రుణాల మంజూరు చేసేందుకు దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించింది. బీసీ కార్పొరేషన్ ద్వారా అయితే యూనిట్ల గ్రౌండింగ్ కూడా ప్రారంభమైంది. తాజాగా మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరుకు అధికారులు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు. ఈ నెల 25వతేదీ తుది గడువుగా నిర్ణయిస్తూ ప్రకటన విడుదల

మిగతా 6వ పేజీలో





పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం

అద్భుతంగా అమరావతి

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోందని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ కోలాహలం నెలకొంది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు





సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు



మహిళల విజయ దరహాసం





దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు



సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు



గ్యాలరీల బయట జనం



ఉత్సాహం.. ఉత్తేజం

(5వ పేజీ తరువాయి)

చంద్రబాబునాయుడు పనితీరును పొగడ్తలతో ముంచెత్తారు. దీంతో జనం, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. కాగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి యంత్రాంగం సహకారంతో 188బస్సులు ఏర్పాటు చేశారు. అందులో అత్యధికంగా ఒంగోలు నుంచి 50, సంతనూతలపాడు నుంచి 40, దర్శి నుంచి 25, కొండపి నుంచి 20 ఏర్పాటు చేయగా మిగిలిన నియోజకవర్గాల నుంచి ఇతర బస్సులను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకే ఆయా ప్రాంతాలకు పంపిన బస్సుల్లో జనం బయల్దేరగా పలుచోట్ల స్థానిక నేతలు జెండాలు ఊపి పంపించారు.

ఒంగోలు నుంచి భారీగా..

ఒంగోలులోని మినీస్టేడియం వద్ద ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నేతృత్వంలో పెద్దసంఖ్యలో బస్సులలో టీడీపీ శ్రేణులు బయల్దేరారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్, జేసీ గోపాలకృష్ణ జెండా ఊపి వాటిని ప్రారంభించారు. ఇతర ప్రాంతాల నుంచి బస్సులతోపాటు ఒక్కో నియోజకవర్గం నుంచి సగటున 50కిపైగా ప్రైవేటు వాహనాల్లో జనం తరలివెళ్లారు. వారందరికీ అటు ప్రభుత్వ యంత్రాంగం, ఇటు పార్టీపరంగా బస్సులు, వాహనాలలో ఆహారం, మజ్జిగ, మంచినీరు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. అలాగే కడప, తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి దాదాపు 170 బస్సులలో అమరావతికి వస్తున్న ఇంచుమించు ఏడున్నర వేల మంది శుక్రవారం తెల్లవారుజామున ఇక్కడికి చేరుకోగా.. వారికి పలు కళాశాలలు, కళ్యాణ మండపాలలో విశ్రాంతి, అల్పాహారం, ఇతర అతిథ్యం జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది. అలాగే ప్రధాని సభ నేపథ్యంలో చెన్నై-కోల్‌కతా రహదారిలో ట్రాఫిక్ ఒంగోలు నగర సమీపంలోని త్రోవగుంట నుంచి మళ్లించారు. జిల్లా పోలీస్ యంత్రాంగం ఉదయం నుంచి సాయంత్రం వరకు త్రోవగుంట బ్రిడ్జి వద్ద మకాం వేసి భారీ వాహనాలను చీరాల వైపు మళ్లించి ట్రాఫిక్ ఇక్కట్లు లేకుండా చేశారు.

సీఎస్‌పురం- ఎస్‌కొండ రహదారి జాతికి అంకితం

అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభంతోపాటు రాష్ట్రంలోని వివిధ రైల్వే, జాతీయ రహదారుల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను ఈసందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ చేశారు. అందులో జిల్లాకు చెందిన కీలక జాతీయ రహదారి ఉంది. పశ్చిమప్రాంతమైన సీఎస్‌పురం నుంచి తూర్పుప్రాంతంలోని సింగరాయకొండ వరకు సుమారు రూ.647 కోట్లతో 90 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసిన రహదారిని జాతికి అంకితం చేశారు. దీనిని రెండు భాగాలుగా నిర్మించారు. సీఎస్‌పురం నుంచి మాలకొండ వరకు 49 కిలోమీటర్ల రోడ్డును రూ.277 కోట్లతో నిర్మించారు. అలాగే మాలకొండ నుంచి సింగరాయకొండ వరకు 46.8 కిలోమీటర్ల రహదారిని రూ.370 కోట్లతో నిర్మించారు. మొత్తం 90 కిలోమీటర్ల రహదారిలో కందుకూరు ప్రాంతం నెల్లూరు జిల్లాలో ఉండగా దాదాపు 60శాతం మేర జిల్లా పరిధిలో ఉంది. ఆ ప్రాంత ప్రజలకు ఇది ఉపయుక్తం కానుంది.

805 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు

(5వ పేజీ తరువాయి)

తగినంత మంది విద్యార్థులు లేక ఎలిమెంటరీ స్కూళ్లుగా డౌన్‌గ్రేడ్ అయిన యూపీ స్కూళ్లలో మిగులు స్కూలు అసిస్టెంట్లు... 3, 4, 5 తరగతులను వెనక్కు పంపడం ద్వారా హైస్కూళ్లలో సుమారు 800 మంది స్కూలు అసిస్టెంట్లు మిగులుగా తేలారు. వీరిలో ఇంగ్లీషు, గణితం ఎస్‌ఏలు అధికం. ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా పనిచేస్తున్న వారు మొత్తం 300 పోస్టులు ఆదర్శ పాఠశాలల హెచ్‌ఎంలుగా సర్దుబాటు చేశారు. మిగిలిన 505కు మిగులు స్కూలు అసిస్టెంట్లను హెచ్‌ఎంలుగా నియమించేందుకు సర్దుబాటు చేశారు. హైస్కూళ్లలో 3, 4, 5 తరగతులకు రెండు పీరియడ్లు బోధించేందుకు ఇష్టపడని ఎస్‌ఏలు ఇప్పుడు పూర్తి సమయం ఆదర్శ పాఠశాలల్లో పనిచేయాల్సి వస్తుంది.

పీడీసీసీబీకి సీతారామయ్య!

(5వ పేజీ తరువాయి)

నియామకాలకు సంబంధించి అధికార తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను ఖరారు చేయగా నియామక ఉత్తర్వులు వెలువడటం ఇటీవలే ప్రారంభమైంది. అలాగే సెంట్రల్ బ్యాంక్, డీసీఎంఎస్ పదవుల నియామకాలను చేపట్టారు. ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించకుండా పర్సన్ ఇన్‌చార్జిలతో కూడిన త్రిసభ్య కమిటీలను అటు జిల్లా స్థాయిలోనూ, ఇటు సొసైటీ స్థాయిలోనూ నియమిస్తున్నారు. రెండు, మూడు రోజుల క్రితం పది ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన డీసీసీబీ, డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జులను ప్రభుత్వం నియమించింది. ఆ సమయంలో మన జిల్లా నియామకాలు జరగలేదు. సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ పదవికి ఆరంభం నుంచి ఒంగోలుకు చెందిన డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, అమ్మనబ్రోలుకు చెందిన ముప్పరపు వీరయ్యచౌదరి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. గతనెల 22వ తేదీన వీరయ్యచౌదరి హత్యకు గురైన సంగతి విదితమే. కారణం ఏమైనా తొలి జాబితాలో మన జిల్లా సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ పదవిని ప్రకటించ లేదు. దీంతో జిల్లాలోని టీడీపీ అధిష్ఠానం కొందరి ముఖ్య నాయకులతో చర్చలు జరిపినట్లు తెలిసింది. ఒంగోలుకు చెందిన డాక్టర్ సీతారామయ్య కోసం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ గట్టిపట్టుపట్టారు. మంత్రి స్వామి కూడా డాక్టర్ సీతారామయ్య కుటుంబానికి సన్నిహితుడు. డాక్టర్ సీతారామయ్య పట్ల జిల్లాలోని ఇతర నియోజకవర్గాల నాయకులు వ్యతిరేకత చూపనప్పటికీ గతంలో కొందరు వీరయ్యచౌదరి పేరుకు సానుకూలత వ్యక్తం చేశారు. ప్రస్తుతం సీతారామయ్య వైపు అందరూ మొగ్గుచూపడంతో సెంట్రల్ బ్యాంక్ చైర్మన్‌గా ఆయనకు అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లుగా తెలిసింది. అయితే పర్చూరు నియోజకవర్గం నుంచి కూడా ఇటు పీడీసీసీబీ అటు డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జి పదవులకు పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఎమ్మెల్యే సాంబశివరావు బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి ద్వారా సెంట్రల్ బ్యాంక్‌కు, డీసీఎంఎస్‌కు ఆయా సామాజికవర్గానికి చెందిన కొందరి పేర్లు అధిష్ఠానానికి సిఫార్సు చేశారు. అయితే తొలి నుంచి సీతారామయ్య పేరు పరిశీలనలో ఉండటం, ఆయన తండ్రి కామేపల్లి రమణారావు 1989లో ఒంగోలు ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోవడం, ఆయన పేరుతో ఏర్పాటు చేసిన వెంటకరమణ వైద్యశాలను ప్రస్తుతం సీతారామయ్య ఆయన సోదరులు నిర్వహిస్తూ టీడీపీ శ్రేణులకు వైద్యసేవలు అందిస్తుండటాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వ కాలంలో సీతారామయ్య ఒంగోలు ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు. టీడీపీ శ్రేణులందరిలోనూ సానుకూలత ఉండటం, ఎమ్మెల్యే జనార్దన్ గట్టిపట్టు పట్టడంతో సీతారామయ్య పేరు ఖరారు చేసినట్లు తెలిసింది.

పశ్చిమ ప్రాంతానికి డీసీఎంఎస్

డీసీఎంఎస్ చైర్మన్ నియామకంపై అధిష్ఠానం ప్రత్యేక పరిశీలన చేసినట్లుగా తెలిసింది. వీలైతే సెంట్రల్ బ్యాంక్ పదవి లేకుంటే డీసీఎంఎస్ చైర్మన్ కనిగిరి నియోజకవర్గానికి కేటాయించాలని తొలి నుంచి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి పట్టుబట్టారు. సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ పదవిని తూర్పుప్రాంతానికి, కమ్మ సామాజికవర్గానికి కేటాయిస్తున్నందున పశ్చిమప్రాంతానికి మరో సామాజికవర్గం వారికి అవకాశం కల్పించే ఉద్దేశంతో కూడా కాశిరెడ్డి పేరును ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకున్నారు. అయితే ఒంగోలు లోక్‌సభకు సెంట్రల్ బ్యాంక్ పదవులు కేటాయిస్తున్నందున బాపట్ల లోక్‌సభ పరిధికి డీసీఎంఎస్ పదవిని ఇస్తే ఎలా ఉంటుందన్న పరిశీలన జరిగింది. ఎమ్మెల్యే ఏలూరి పర్చూరు నుంచి డీసీఎంఎస్‌కు కూడా ఆయా సామాజిక వర్గాల పేర్లు పరిశీలించారు. అందులో బీసీల్లో ఒకరి పేరు ప్రతిపాదించినట్లు తెలిసింది. అయితే ఇప్పటికే బాపట్ల జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉండటం, సెంట్రల్ బ్యాంక్ పదవి తూర్పు ప్రాంతానికి ఇవ్వడంతో పశ్చిమప్రాంతానికి ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచనకు అధిష్ఠానం వచ్చినట్లుగా తెలిసింది. పైగా ఎమ్మెల్యే ఉగ్ర సిఫార్సు చేసిన కాశిరెడ్డి 2014 ఎన్నికల ముందు నుంచి ఇప్పటివరకు టీడీపీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఎవరు పార్టీ మారినా ఆయన టీడీపీలోనే ఉన్నారు. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకొని కాశిరెడ్డిపై మొగ్గుచూపినట్లుగా తెలుస్తోంది.

వీరయ్య కుటుంబానికి బాసటగా

ఇటీవల హత్యకు గురైన వీరయ్యచౌదరి కుటుంబానికి బాసటగా నిలవాలని టీడీపీ అధిష్ఠానం నిర్ణయించుకుంది. అయితే ఆయన కుమారుడు ఇంటర్ పూర్తిచేసి ఉన్నత విద్యకు సిద్ధమై ఉన్నాడు. అతని భార్యకు రాజకీయ అనుభవం లేదు. కానీ వారికి సంబంధించి అన్ని విషయాలపై ప్రత్యేకించి నారా లోకేష్ సమాచారం సేకరించుకొని పరిశీలించి చేయూత నిస్తున్నట్లు తెలిసింది. రాజకీయంగా చేయూతకు కొంత సమయం పట్టే అవకాశం ఉంది. వీరయ్యచౌదరి మేనమామ మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు ప్రస్తుతం జనసేనలో ఉండగా, పీడీసీసీబీ మాజీ చైర్మన్ ఈదర మోహన్‌బాబు బీజేపీలో ఉన్నారు. వీరయ్య కుటుంబానికి అండగా ఉండాలని నిర్ణయించుకున్న అధిష్ఠానం వివిధ రూపాల్లో ఆలోచన చేస్తున్నప్పటికీ డీసీసీబీ, డీసీఎంఎస్ పదవుల్లో మాత్రం రాజకీయపరమైన అనుభవాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

కదులుతున్న బోగస్ డొంక

(5వ పేజీ తరువాయి)

తెలియజేయడంతో మెప్మా అధికారులు వారి వద్ద నుంచి వివరాలు సేకరించారు. దీంతో ఉలిక్కిపడిన కేశవస్వామిపేట బాధ్యతలు చూసే ఆర్పీ పొదుపు సంఘాల పేరుతో తాను తీసుకున్న సొమ్మును తిరిగి బ్యాంకులకు చెల్లిస్తానని, ఆ విషయాన్ని ఇంతటితో వదిలేయాలని బతిమాలే ప్రయత్నం చేసినట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు జరిగిన మోసంతో తాము చాలా నష్టపోయామని తెలిపిన పొదుపు సంఘాల మహిళలు.. ఆన్‌లైన్ పేరుతో కూడా ఆర్పీ తమను మోసం చేసిందని వాపోయారు. వాస్తవానికి రుణాలకు సంబంధించి ఆన్‌లైన్ చేయడానికి ఎలాంటి ఫీజులు లేకపోయినా, వేలకు వేలు తీసుకున్నదని ఆరోపించారు. ఇదే విషయమై కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

ఆ ఆర్పీపై వేటు

మెప్మా అధికారులు సైతం కేశవస్వామిపేట ఆర్పీపై సీరియస్‌గా దృష్టి సారించారు. ఇప్పటికే తమ వద్ద ఉన్న సమాచారంతోపాటు, బ్యాంకుల వారీగా వివరాలు సేకరించి ఆ ఆర్పీని ఆ బాధ్యతల నుంచి తొలగించనున్నట్లు సమాచారం. ఇదిలా ఉంచితే అదే ఆర్పీ ఇప్పటికే ఏడు పురుషుల గ్రూపుల పేరుతో రుణాలు తీసుకుని సొంతానికి వాడుకున్నట్లు వెలుగులోకి వచ్చింది. అయితే గతంలో ఆర్పీలుగా ఉంటూ అవినీతికి పాల్పడిన వారిని విధుల నుంచి తొలగించారు. వారు నేటికీ వారు ఆర్పీలుగా చెలామణి అవుతూ రుణాలు పేరుతో బ్యాంకులను బురిడీ కొట్టిస్తున్నారు. అలాంటి వారిపై శాఖాపరంగా చర్యలకు డ్వామా అధికారులు సిద్ధమైనట్లు తెలిసింది. దీంతో అక్రమాలకు పాల్పడిన ఆర్పీలలో ఆందోళన మొదలైంది. తాము చేసిన అవినీతి, అక్రమాలను సరిచేసుకునే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం. అలాగే బోగస్ గ్రూపులకు సహకరించిన మెప్మా కార్యాలయ ఉద్యోగుల పాత్రపైనా అధికారులు దృష్టి సారించారు. ఇందులో కేవలం ఆర్పీలు మాత్రమే కాదని, సీఎంఎం, సీవోలు, కార్యాలయంలోని ఓ ఉద్యోగి కుమ్మక్కై ఈ తరహా దోపిడీకి పాల్పడినట్లు సమాచారం. మొత్తంగా మెప్మాలో బోగస్ గ్రూపుల బాగోతం వెలుగులోకి రావడంతో అందులో భాగస్వాములైన వారు ఉలిక్కిపడుతున్నారు. తమకు తెలిసిన దారుల్లో వాటిని కప్పిపుచ్చుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది.

మైనారిటీలకు ఊరట

(5వ పేజీ తరువాయి)

చేశారు. రాష్ట్రప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని మైనారిటీ వర్గాలకు రూ.12.05 కోట్ల రుణాలను అందజేయనుంది. నాలుగు శ్లాబులుగా వీటిని నిరుద్యోగులకు ఇవ్వనుంది. అందులో సగం కార్పొరేషన్ సబ్సిడీ కాగా, మిగిలిన సగం బ్యాంకుల నుంచి రుణంగా ఇస్తారు. ఈనెల 25 వరకూ దరఖాస్తులను స్వీకరించి ఆతర్వాత లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. మొదటి శ్లాబులో రూ.లక్ష వరకు రుణం అందజేస్తారు. దీని కింద కిరాణా దుకాణం, పాన్ షాపు, చికెన్, మటన్, పండ్ల దుకాణం, కూరగాయల అమ్మకం, ఎలక్ట్రికల్ రిపేర్లు, సైకిల్ షాపు మొదలైన యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చు. రెండో శ్లాబు కింద రూ.లక్ష నుంచి రూ.3లక్షలు అందజేస్తారు. దీని కింద రుణం పొందిన వారు ఏసీ, ఫ్రిడ్జ్ రిపేర్లు, ఆటోమొబైల్ స్పేరు యూనిట్లు, బ్యాటరీ సర్వీసింగ్, సెల్‌ఫోన్ రిపేర్లు, ఫుట్‌వేర్ దుకాణాలు, ఫ్యాషన్ డిజైన్, బ్యూటీపార్లర్ మొదలైన యూనిట్లను స్థాపించుకోవచ్చు. మూడో శ్లాబు కింద రూ.3 నుంచి రూ.5లక్షల వరకు రుణం మంజూరు చేస్తారు. దీని కింద ఆటోమొబైల్, రవాణా రంగం, ఫ్యాబ్రికేషన్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చు. నాలుగో శ్లాబు కింద రూ.8 లక్షల వరకు రుణం అందజేస్తారు. దీంతో జనరిక్ మందుల దుకాణాలు, ఆటోమొబైల్ యూనిట్లు, ఫిట్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు

జిల్లాలోని మైనారిటీ వర్గాలకు చెందిన ముస్లింలు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, పార్శీలు ఈ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ కార్పొరేషన్ ఈడీ ధనలక్ష్మి కోరారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఏపీబీఎంఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా పంపాలని ఆమె కోరారు. డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తుతోపాటు సంబంధిత సర్టిఫికెట్లను జత చేసి ఆయా మండల అభివృద్ధి అధికారులకు, మునిసిపల్ కమిషనర్లకు అందజేయాలని కోరారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకునే వారి వయస్సు 21 నుంచి 55 సంవత్సరాలలోపు ఉండాలని తెలిపారు. దరఖాస్తుదారుని కుటుంబ ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలు మాత్రమే ఉండాలని తెలిపారు. తెలుపు రంగు రేషన్ కార్డు కలిగి ఉండాలని వివరించారు. రవాణా రంగంలో యూనిట్లను ఏర్పాటు చేసుకునే దరఖాస్తుదారులకు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని ఆ మె తెలిపారు.

వినోదం.. వికాసం..!

వేసవి సెలవుల్లో చిన్నారుల కోసం సమ్మర్ క్యాంపులు

క్రీడలు, డ్యాన్స్, సంగీతం, చిత్రలేఖనం శిబిరాల ఏర్పాటు

పిల్లలు పలు రంగాల్లో రాణించేలా ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు



డ్రాయింగ్ నేర్చుకుంటూ..



నాట్య శిక్షణలో చిన్నారులు



ఏడాదిపాటు పాఠ్యపుస్తకాలతో కుస్తీ పట్టిన చిన్నారులకు.. వేసవి సెలవుల్లో తమలో ఉన్న సృజనాత్మకతకు పదును పెట్టేందుకు ఉద్యుక్తులవుతున్నారు. క్రీడలు, డ్రాయింగ్, పెయింటింగ్, డ్యాన్స్ సంగీతం, స్విమ్మింగ్, చెస్, వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్ ఇలా ఏదో ఒక రంగంలో తమ ప్రతిభను మెరుగుపరచుకునేందుకు సిద్ధమయ్యారు. ఒంగోలు నగరంలో ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు పలుచోట్ల ఉన్న శిబిరాల్లో అనేక రంగాల్లో శిక్షణ అందించేందుకు సమ్మర్ క్యాంపులు ఏర్పాటయ్యాయి. ఇప్పటికే జిల్లా క్రీడాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నెల రోజులపాటు మినీ స్టేడియంలో 50 క్రీడా రంగాల్లో శిక్షణ అందించే సమ్మర్ క్యాంప్‌న ప్రారంభమైంది. అలాగే దిలార్డ్ కృష్ణ కోచింగ్ అకాడమీలో రోజూ ఉదయం, సాయంత్రం రెండు గంటపాటు షటిల్‌లో కోచింగ్ ఇస్తున్నట్లు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు అద్దంకి మురళీ కృష్ణ చెప్పారు. రంగుల ఆర్ట్స్ గ్యాలరీ ఆధ్వర్యంలో చిన్నారులకు చిత్రలేఖనం, అలాగే షైద రీక్లబ్‌లో చెస్‌లో శిక్షణ శిబిరాలు అందుబాటులో ఉన్నాయి. శర్మకాలేజి క్రీడామైదానంలో, మంగమూరు రోడ్‌లోని జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోజూ ఉదయం, సాయంత్రం క్రికెట్‌లో శిక్షణ అందిస్తూ క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నారు. ఏబీఎం జూనియర్ కాలేజీ ఆవరణలో ఫుట్‌బాల్, సృష్టి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 20 ఏళ్లుగా చిన్నారులకు చిత్రలేఖనంలో శిక్షణ అందిస్తూ పలువురు రికార్డులు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు. ఇదిలా ఉండగా, శర్మాకాలేజీ సమీపంలో మ్యూజిక్ తరగతులు నిర్వహిస్తూ, కీబోర్డ్, తబల, గిటార్, తదితర సంగీత వాయిద్యాలపై శిక్షణ అందిస్తున్నారు. సీవీఎన్ రీడింగ్ రూమ్ ఆవరణలో కరాటేలో శిక్షణ ఇస్తున్నారు. వేసవి సెలవుల్లో వినోదమే కాకుండా వికాసం, వ్యాయామంతో ఆనందంగా గడిపేస్తున్నారు.

- ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)





షటిల్ తర్ఫీదు పొందుతూ..



కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

నాలుగో రోజుకు చేరిన నిరవధిక సమ్మె

ఒంగోలు కలెక్టరేట్, మే 2 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి నాలుగో రోజుకు చేరింది. సమ్మెను ఉద్దేశించి రాష్ట్ర నాయకులు మందరగిరి రాజేష్ మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు 23శాతం ఇంక్రిమెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ముఖ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వడంతో పాటు కమ్యూనిటీ ఆఫీసర్లందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ కష్టతరంగా ఉందని, అందువల్ల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

మా సమస్యలు పరిష్కరించరూ!

- మర్రిపూడి గ్రామస్థుల వేడుకోలు
- నేడు గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- హాజరుకానున్న మంత్రి డాక్టర్ స్వామి

మర్రిపూడి, మే 2 (ఆంధ్రజ్యోతి) : కొండపి నియోజకవర్గంలో అత్యంత వెనుకబడిన మండలం మర్రిపూడి. ఇక్కడి ప్రజలు కరువు కాటకాలతో సహజీవనం చేస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో అత్యంత కరువు పీడిత మండలాల్లో ప్రభుత్వం మర్రిపూడిని చేర్చడం తీవ్రతను అద్దం పడుతోంది. పూర్తిగా వర్షాధారంపైనే ఆధారపడి వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి. సాగునీటి వసతి లేక చెరువులు ఒట్టిపోయాయి. వీటి కింద సేద్యం గాలిలో దీపంలా మారింది. శాశ్వత సాగునీటి పథకాల ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. పనులు లేక వేలాది మంది ప్రజలు వలసబాట పట్టడం ఏళ్లుగా కొనసాగుతోంది. గత వైసీపీ పాలనలో అభివృద్ధి 'ఎక్కడవేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా మారింది. అంతకుముందు టీడీపీ ప్రభుత్వంలో మంజూరైన రూ.కోట్ల పనుల ప్రగతి అటకెక్కింది. దీంతో పలు గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. వైసీపీ పాలనలో ప్రారంభించిన నాడూ-నేడు పనులు సైతం అర్ధంతరంగా నిలిచిపోయాయి.

దేవదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బందులు

దేవదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం మర్రిపూడి ప్రజలకు శాపంగా మారింది. సర్వే నంబరు 547లో 43 ఎకరాలు గ్రామ కంఠం భూమి ఉండగా అందులో కేవలం 40 సెంట్లలో మాత్రమే రామలింగేశ్వర స్వామి, వేణుగోపాల స్వామి దేవాలయాలు ఉన్నాయి. అయితే దేవదాయ శాఖ అధికారులు ఆ సర్వే నంబరు మొత్తాన్ని నిషేధిత జాబితాలో చేర్చడంతో గ్రామంలో ఆస్తుల క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. పిల్లల పెళ్లిళ్లు, ఉన్నత చదువులు, ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఆస్తులు అమ్ముకోలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిషేధిత జాబితా నుంచి మర్రిపూడి గ్రామాన్ని తొలగించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు కనికరం చూపడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో శనివారం రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి మండలం కేంద్రమైన మర్రిపూడిలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలపై ఆయన దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



అర్ధంతరంగా ఆగిపోయిన కూచిపూడి-నరసాపురం రోడ్డు

వామ్మో పులి

- అర్ధవీడు మండలంలో సంచారం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌వో ప్రసాద్‌రెడ్డి సూచన

అర్ధవీడు (కంభం), మే 2 (ఆంధ్రజ్యోతి): అర్ధవీడు మండలంలోని పలు ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న మార్కాపురం ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ప్రసాద్‌రెడ్డి శుక్రవారం మండలంలోని కొత్తూరు, వీరభద్రాపురం, మొహిద్దీన్‌పురం కల్పనేశ్వరస్వామి దేవాలయం సమీపం, మాగుటూరు తండా, లక్ష్మీపురం తదితర గ్రామాలలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. రాత్రివేళ ఎవరూ బయట తిరగవద్దని, గేదెలను వెలుగులో కట్టేయాలని సూచించారు. 3 రోజులక్రితం పెద్దపులి కొత్తూరు సమీపంలో గేదెను చంపిందని, తరచూ గేదెలపై దాడిచేస్తూ చంపుతున్నట్లు స్థానికులు అధికారుల దృష్టికి తెచ్చారు. ఆ రైతులకు నష్టపరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు.

జిల్లాస్థాయి బీచ్ కబడ్డీ జట్టుకు పాకల విద్యార్థినుల ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న పీడీ హజరత్తయ్య

సింగరాయకొండ, మే 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు మండలంలోని పాకల జడ్పీ హైస్కూల్‌కి చెందిన వి.అర్చన, కె.భూమిక, కె.సౌమ్య, కె.సిపోరా, కె.త్రిగుణ ఎంపికయ్యారు. వీరు తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో ఈనెల 5 వరకు జరిగే అంతర్ జిల్లాల టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. ఐదుగురు విద్యార్థినిలను హెచ్‌ఎం ప్రసాద్, పీడీ హజరత్తయ్య, గ్రామస్థులు అభినందించారు.



అరటి చెట్టును చూపుతున్న యువ రైతు రఘు ప్రసాదరెడ్డి

ఆయన ఒక యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. ఏడాదికి లక్షల్లో జీతం ఆర్జిస్తూ బెంగళూరులో విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారు. అందులో సంతృప్తి చెందలేదు. ఏదో వెలితి అతనిని వెంటాడేది. ఆరోగ్యంపై శ్రద్ధ ఎక్కువగా ఉండేది. దానికి అనువైన ఆహారపు పంటలు, తోటలు సాగు చేయాలని కోరిక బలంగా ఉండేది. ప్రకృతి సేద్యం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని ఏడాదిపాటు ప్రయత్నాలు చేశారు. సొంత గ్రామమైన ముండ్లమూరు మండలం పసుపుగల్లు వచ్చి ప్రకృతి సేద్యంపై దృష్టి సారించారు. తనకు ఉన్న ఐదు ఎకరాల భూమిలో రెండు బోర్లు వేయించి వ్యవసాయాన్ని ప్రవృత్తిగా మార్చుకున్నారు. నేడు రక రకాల పండ్ల తోటల పెంపకం చేపట్టారు. ఏడాదికి రూ.10 లక్షలకు పైగా పొందుతున్నారు. ఎంతో మందికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలిచిన ఓ యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు విజయ గాథ తెలుసుకుందాం.



పసుపుగల్లులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన వివిధ రకాల పండ్ల మొక్కలు

యువ రైతు ఆదర్శ వ్యవసాయం

- పండ్ల తోటల పెంపకంపై మక్కువ
- ఆరోగ్యకర సమాజ నిర్మాణమే లక్ష్యం
- సేంద్రీయ ఎరువులు.. కుళ్లిన పండ్లు పంటకు వినియోగం
- ఏడాదికి రూ.10 లక్షలపైనే ఆర్జన

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి.. ప్రకృతి సాగువైపు కదిలి..



పండ్ల తోటలకు నీరు పెట్టేందుకు పొలంలోనే ఏర్పాటు చేసుకున్న భారీ నీటి నిల్వ తొట్టె

ముండ్లమూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన బిజ్జం వెంకటేశ్వరరెడ్డి, మల్లేశ్వరి దంపతుల కుమారుడు రఘు ప్రసాదరెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. బెంగళూరులోని ప్రముఖ కంపెనీలో 2011 నుంచి 2024 వరకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశారు. 2021 నుంచి ఒకవైపు ఉద్యోగం చేస్తూనే ప్రకృతి వ్యవసాయంపై మక్కువ పెంచుకున్న రఘు ప్రసాదరెడ్డి ఈ ఏడాదిలోనే ఉద్యోగానికి రాజీనామా చేశారు. పూర్తిగా ప్రకృతి వ్యవసాయంపైనే దృష్టి పెట్టి తనకు ఉన్న ఐదెకరాల్లో మలబెరీస్, మేడిపండు, సమ్మర్ యాపిల్, అవకాడో, జీడిమామిడి, అరటి, కొబ్బరి, లెమన్, జామ, మామిడి, వాటర్ యాపిల్, సపోట, ఖర్జూర, పనస, సీతాఫలం, పినేట్ బటర్ ఫ్రూట్, నిమ్మ, వంకాయ తదితర పండ్ల మొక్కలతోపాటు మిరప, కంది, మునగ తదితర పైర్లను సాగు చేశారు. వచ్చిన దిగుబడిని మార్కెట్‌కు కాకుండా తన స్నేహితులతో పాటు ఆర్గానిక్ ఫుడ్‌కు అలవాటు పడిన వారికి మాత్రమే అమ్మకాలు చేస్తున్నారు. గతేడాది రూ.10 లక్షల మేర ఆదాయం లభించింది. పూర్తిగా పురుగు మందులు లేకుండానే ప్రకృతి సేద్యంతో పండ్ల తోటలు, వాణిజ్య పంటలు పండిస్తూ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారు. పైపెచ్చు తన పండ్ల తోటల్లో వచ్చే గడ్డి, కుళ్లి పోయిన వివిధ రకాల పండ్లను మురగ బెట్టి ఎరువుగా వినియోగిస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందుతూ ప్రజల ఆరోగ్యానికి హాని కలగడకుండా పండ్లు పండిస్తున్నారు. ఈ పండ్లు ఒంగోలు, బెంగళూరు, చెన్నై లాంటి పట్టణాల్లో ఉండే తన స్నేహితులకు పంపుతున్నారు. మొత్తం మీద యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు చేపట్టిన ప్రకృతి సాగువైపు గ్రామంలో మరికొంత మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల దృష్టి మళ్లింది.

ఆరోగ్యకర పంటలే నా లక్ష్యం

నాలాంటి ఎంతో మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వ్యవసాయంపై మక్కువ చూపుతున్నారు. వారందరూ ప్రకృతి వ్యవసాయం ద్వారానే పండ్ల తోటలు సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నాను. నాలానే కొంతమంది అయినా ఇలాంటి పండ్ల తోటలు, వాణిజ్య పంటలు సాగు చేస్తే బాగుంటుంది. లక్షలాది రూపాయల సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా నాకు తృప్తి లేదు. సొంత గ్రామంలో, సొంత పొలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయాలని నిర్ణయించుకున్నాను. ఇటీవల నేను రెండు ఎకరాల్లో కంది వేశాను. దిగుబడి తక్కువగా ఉన్నా ఎరువులు పురుగు మందులు లేకుండా పండించటం వల్ల కేజీ రూ.300లకు అమ్మాను.

-బిజ్జం రఘు ప్రసాదరెడ్డి, సాఫ్ట్‌వేర్ ఇంజనీరు, పసుపుగల్లు, ముండ్లమూరు మండలం

ఆంధ్రుల కలల రాజధాని అమరావతి

ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ● ఒంగోలు నుంచి బస్సుల ప్రారంభం ● తరలిన కూటమి శ్రేణులు



ఒంగోలులో తెలుగు మహిళలతో ఎమ్మెల్యే దామచర్ల అభివాదం


చీమకుర్తి నుంచి తరలివెళ్తున్న టీడీపీ నాయకులు

ఒంగోలు కార్పొరేషన్, మే 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి పునఃప్రారంభ కార్యక్రమానికి తెలుగు తమ్ముళ్ళు భారీగా తరలి వెళ్లారు. ఒంగోలు నియోజకవర్గం నుంచి 50 బస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక మినీ స్టేడియం వద్ద ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయ్‌కుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, జేసీ గోపాలకృష్ణలు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరావతి పునఃనిర్మాణం, దేశ చరిత్రలోనే నిలిచిపోతుందని తెలిపారు. కూటమి పాలనలో ఆంధ్రుల కలల రాజధాని మళ్ళీ జీవం పోసుకుంటుందన్నారు. దేశానికే తలమానికంగా అమరావతి అభివృద్ధి చెందబోతుందని చెప్పారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అద్భుతమైన అమరావతి అవతరించనుందని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, కమిషనరు కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మండలాల నుంచి..

ఒంగోలు(రూరల్): అమరావతికి మండలంలోని ప్రతి గ్రామం నుంచి ప్రజలు శుక్రవారం 9 బస్సులలో తరలివెళ్లారు. ఈవోఆర్డీ బాలచెన్నయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చీమకుర్తి: అమరావతి పనులు పునఃప్రారంభోత్సవ కార్యక్రమానికి చీమకుర్తి నుంచి శ్రేణులు భారీగా తరలివెళ్లారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, మహిళలు అమరావతి సభకు ఉత్సాహంగా బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. టీడీపీ నాయకుడు కాట్రగడ్డ రమణయ్య తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: అమరావతి పునర్నిర్మాణ సభకు మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన కూటమి పార్టీ శ్రేణులు, ప్రజలు శుక్రవారం బస్సులలో తరలివెళ్లారు. చదలవాడ, మద్దిరాలపాడు, చీర్వానుప్పలపాడు, ఉప్పుగుండూరు, ఈదుమూడి తదితర గ్రామాల నుంచి ప్రజలు వారికి కేటాయించిన బస్సులలో కోలాహలంగా బయలుదేరారు. ఇన్నాళ్లు రాష్ట్రానికి రాజధాని లేక ఇబ్బందులు ఎదుర్కొన్న కూటమి ప్రభుత్వం రాజధాని నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మద్దిపాడు: మండల పరిధిలోని గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో శుక్రవారం అమరావతిలో జరిగిన రాజధాని పునః నిర్మాణ సభకు తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు ఆధ్వర్యంలో 9 బస్సులు, 28 కార్లలో ర్యాలీగా బయల్దేరగా ప్రతి బస్సుకు జయంత్‌బాబు భోజనం ప్యాకెట్లు, మంచినీటి, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసప్రసాద్, ఆర్ఐ రమణయ్య, ఏపీఎం కాకుమాను సుబ్బారావు, కె.బాలకోటయ్య, అద్దేపల్లి భవాని, ముత్తనపల్లి రామలింగయ్య, రెబ్బవరపు ప్రభాకర్, శుద్ధపల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.


మద్దిపాడు నుంచి వెళుతున్న నాయకులు

ట్రెజరీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


ఎంపీ మాగుంటను సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మే 2 (ఆంధ్రజ్యోతి): ట్రెజరీ శాఖలో అనేక సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ నాయకులు కోరారు. ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కమిటీ నాయకులు శుక్రవారం స్థానిక రామనగర్‌లోని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌వీ.కృష్ణ, పి.అంకబాబుల ఆధ్వర్యంలో ఎంపీ మాగుంటకు బొకే అందజేసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలో ట్రెజరీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పీవీఎల్ఎన్.వరకుమార్, కె.రామకృష్ణ, కె.లావణ్య, బి.అక్కేశ్వరరావు, ఎస్‌కే.కరీముల్లా, కె.వెంకటేశ్వర్లు, పి.హేమలత, కె.ప్రసాద్‌చంద్ర, డి.అనిల్, సీహెచ్.ఫణీంద్ర, కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రైజ్ విద్యార్థులకు ఉద్యోగాలు


విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఒంగోలు విద్య, మే 2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి గ్రూపు ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న 13 మంది విద్యార్థులు మూనా డాటమ ఆటిక్స్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు తెలిపారు. కంపెనీ ప్రతినిధి మైఖేల్ స్థానిక కళాశాలలో రాతపరీక్ష, బృంద చర్చ, టెక్నికల్, హెచ్ఆర్ రౌండ్ నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరికి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వార్షిక ప్యాకేజీ లభిస్తుంది. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల గౌరవ చైర్మన్ రంగమన్నార్, ట్రెజరర్ శిద్దా భరత్, డైరెక్టర్ ఏవీ.భాస్కరరావు, శిద్దా ప్రవల్లిక, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్‌వీ.రఘుబాబు అభినందించారు.

టెన్త్ టాపర్లకు అభినందన


జ్ఞాపికలను అందుకున్న విద్యార్థినులు

ఒంగోలు విద్య, మే 2 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఒంగోలు నగరం, రూరల్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థినులను గురువారం స్థానిక బండ్లమిట్ట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం కృష్ణకుమారి అభినందించారు. ఈ సందర్భంగా కొవ్వూరి అక్షర 591, ఎస్‌కే.కౌసరున్నీసా 590, నాగజాహ్నవి 582 మార్కులతో మొదటి మూడు స్థానాల్లో నిలవగా వారికి వ్యాపారి మోహన్‌లాల్ బహుమతులు అందజేశారు. విద్యార్థినులను టీచర్లు, విద్యార్థులు అభినందించారు.

లోక కల్యాణమే కృష్ణావతార పరమార్థం


శివసుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న పరిషత్ కార్యవర్గ సభ్యులు

ఒంగోలు(కల్చరల్), మే 2(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణం కోసమే విష్ణుమూర్తి శ్రీకృష్ణునిగా అవతారం దాల్చాడని, ఆయన బోధించిన భగవద్గీత ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని ప్రముఖవాస్తు, జ్యోతిష్య సిద్ధాంతి, ఆధ్యాత్మిక ప్రవచకులు అగస్త్యరాజు శివసుబ్రహ్మణ్య శర్మ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక వీఐపీరోడ్‌లోని జాతీయ పద్యసారస్వత పరిషత్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన శ్రీకృష్ణలీలలు అనే అంశంపై ప్రవచనం చేశారు. శ్రీకృష్ణ జననం, బాలకృష్ణుని లీలలు తదితర విషయాలను ఆయన సోదాహరణంగా పోతన భాగవత పద్యాలతో వివరించారు. అనంతరం పరిషత్ గౌరవ అధ్యక్షులు చదలవాడ నరసింహారావు, కార్యదర్శి పింగళి పూర్ణచంద్రరావు, కమిటీ సభ్యులు శివసుబ్రహ్మణ్యంను ఘనంగా సత్కరించారు.

ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి


శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు(కల్చరల్), మే 2(ఆంధ్రజ్యోతి) : జగద్గురు ఆది శంకరాచార్య జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కేశవస్వామిపేట లలిత ఆశ్రమంలో ముందుగా శంకరాచార్యులు వారి చిత్రపటానికి పూజలు నిర్వహించి అనంతరం నగరంలోని గాంధీరోడ్డు, పప్పుబజారు, ఏనుగుచెట్టు, తాతా బిల్డింగ్స్ మీదుగా జరిగిన శోభాయాత్రలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన వేద పరీక్షలకు ప్రముఖ వేద పండితులు వంగల కృష్ణమూర్తి అవధాని, పిన్నెల్లి చంద్రశేఖర్ అవధాని పరీక్షాధికారులుగా వ్యవహరించారు. వేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అన్నదానం జరిగింది. కార్యక్రమంలో వేద స్మార్త ప్రవర్తక విద్వత్ పరీక్షా పరిషత్ అధ్యక్షులు నేలభొట్ల సదాశివశాస్త్రి, కార్యదర్శి మహంకాళి వెంకటశేషయ్య, సముద్రాల భీమశంకరశాస్త్రి, తొండేపి మల్లినాథుడు, ఆలూరి రామారావు, భారతుల శ్రీనివాసశర్మ, మైనంపాటి సాయికుమార్, వ్యామజాల ప్రసన్నకుమార్‌శర్మ, ఓరుగంటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక రంగారాయుడు చెరువు దగ్గర ఉన్న శ్రీకంచి కామాక్షి దేవస్థానం, భూదేవి శ్రీదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం, సంతపేట షిరిడి సాయిబాబా మందిరం మొదలైన ఆలయాలలో, శ్రీ సనాతన ధార్మిక సంఘం కార్యాలయలో స్వయంపాకుల యల్లమందల కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో శంకరాచార్యులు జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఒంగోలు(రూరల్), మే2(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతకు బాలికలు ప్రాధాన్యత ఇవ్వాలని మహిళా పోలీస్ నాగలక్ష్మి సూచించారు. ఒంగోలు మండలం దేవరంపాడు ఎస్సీ పంచాయతి కార్యాలయంలో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు పౌష్టిక ఆహారం తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలు, కోడిగుడ్లు, పాలు, మాంసం వంటి ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి, బాలికలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిరోధించాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సూపర్‌వైజర్ శ్రీదేవి

నాగులుప్పలపాడు, మే 2 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నిరోధించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి కోరారు. ఉప్పుగుండూరులోని అంగన్‌వాడీ సెంటర్‌లో కిశోరి వికాసంలో భాగంగా బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ బాలికలు చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. వినోదరాయునిపాలెంలో సర్పంచ్ అశోక్ పాల్గొని ప్రసంగించారు.

మద్దిపాడు: మద్దిపాడులో కిశోరి వికాసంపై సీడీపీవో ఇవాంజెలిన్ అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ పద్మావతి, నాగరాజు పాల్గొన్నారు.

‘కిశోరి వికాసం’ పటిష్టంగా అమలు చేయాలి

● కలెక్టర్ అన్సారియా


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా, అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, మే 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కిశోరి వికాసం కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం కిశోరి వికాసం పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 11నుంచి 18 సంవత్సరాల లోపు బాలబాలికల అభివృద్ధి, రక్షణ, సాధికారత, బాల్య వివాహాలను అడ్డుకోవడం, ఆరోగ్యం, విద్య, పోషణ, నైపుణ్యాలు, భద్రత, ఉపాధి కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకాన్ని జిల్లాలో పక్కాగా అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారి బి.హేనసుజన, జిల్లా బాలల సంరక్షణ అధికారి దినేష్‌కుమార్, సీపీవో వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు, డీఈవో కిరణ్‌కుమార్, సార్డ్స్ సంస్థ ప్రతినిధి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలి

● నాల్గవ రోజుకు చేరిన నిరవధిక సమ్మె


కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న సీహెచ్‌వోలు

ఒంగోలు కలెక్టరేట్, మే 2 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖ పరిధిలో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ల (సీహెచ్‌వో) సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి నాల్గవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు మందరగిరి రాజేష్ మాట్లాడుతూ కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ల సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు 23శాతం ఇంక్రిమెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ముఖ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వడంతో పాటు సీహెచ్‌వోలను రెగ్యులర్ చేయాలని కోరారు. చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ కష్టతరంగా ఉందని, అందువల్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నిర్మల, కార్యదర్శి ప్రసన్న, దీప్తి, కామేష్, నవీన్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కగార్ ఆపరేషన్‌ను నిలుపుదల చేయాలి

● సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డిమాండ్


మాట్లాడుతున్న చిట్టిపాటి వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, మే 2 (ఆంధ్రజ్యోతి) : కగార్ ఆపరేషన్‌ను నిలుపుదల చేసి మావోయిస్టు పార్టీతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.మోహన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దండకారణ్యంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రప్రభుత్వం చేపట్టిన కగార్ ఆపరేషన్‌ను నిలుపుదల చేయాలని, దీనివల్ల 237 గ్రామాలకు చెందిన 35వేల ఆదివాసీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఈ దాడులను నిలుపుదల చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొండారెడ్డి, ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్, సంయుక్త కిసాన్‌మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావులు ధర్నాకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బి.సుబ్బారావు, కోటి, పద్మ, నాంచార్లు, రాజశేఖర్, జాలన్న తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడు అనుమానాస్పద మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ అజయ్‌కుమార్

ఒంగోలు క్రైం, మే2(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద రీతిలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఒంగోలు నగరం కొప్పోలు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద శుక్రవారం ఉదయం వెలుగు చూసింది. నగరంలోని దేవుడుచెరువులో నివాసం ఉండే ఎస్‌కే..మహబూబ్‌బాషా (63) పాతరేకులు వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో ఎఫ్‌సీఐ ఎదురుగా ఉన్న ఇందిరకాలనీలో నివాసం ఉండే మహబూబ్ బాషా కుమార్తె ఇంట్లో భోజనం చేసి ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద సిమెంట్ బల్లల పైన రాత్రులు పడుకుంటాడు. అతనికి మద్యం సేవించే అలవాటు ఉంది. అంతేగాకుండా గురువారం పింఛను రావడంతో అతని స్నేహితులు నలుగురుతో కలిసి రాత్రి 11 గంటల వరకు మద్యం తాగినట్లు చెబుతున్నారు. తెల్లవారేసరికి సిమెంట్ బల్ల మీద కాకుండా కింద పడి మృతి చెందాడు. ఛాతి మీద గాయమై రక్తం కారింది. సమాచారం అందుకున్న తాలుకా పోలీస్‌స్టేషన్ సీఐ అజయ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడి ఛాతిపై గాయం ఎలా అయిందనే పోలీసులు విచారిస్తున్నారు. అతనితో కలిసి మద్యం తాగిన వారిని విచారించారు. కేసు దర్యాప్తులో భాగంగా ఆయా పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

కులగణనకు స్వాగతం


మాట్లాడుతున్న మస్తాన్‌రావు

ఒంగోలు కలెక్టరేట్, మే 2 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నట్లు పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మంచి పుస్తకం షాపు వద్ద శుక్రవారం బీసీ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ గుంటూరు మస్తాన్‌రావు మాట్లాడుతూ కేంద్రం త్వరలో కులగణన చేస్తామని ప్రకటించిందని, దాని అమలును సత్వరమే చేపట్టాలని కోరారు. రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ అజీజ్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో తాటపర్తి వెంకటస్వామి, చావలి సుధాకర్, పేరయ్య, బి.సుబ్బారావు, శివరావు, ఏవీ.సుబ్రహ్మణ్యం, మిరియం అంజిబాబు, ఆంజనేయులు, కె.పెద్దన్న, మాచవరపు రామాంజనేయులు, వీరభద్రాచారి పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు సర్టిఫికెట్ కోర్సులో శిక్షణ

ఒంగోలు కార్పొరేషన్, మే 2 (ఆంధ్రజ్యోతి): బొల్లినేని మెడిస్కిల్స్ ఆధ్వర్యంలో డిగ్రీ చదివిన విద్యార్థులకు స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సులను అందిస్తున్నట్లు సంస్థ సీహెచ్.నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య రంగంలో నైపుణ్యాలను అందించే ఈ సర్టిఫికెట్ కోర్సుకు డిగ్రీ పాస్ / ఫెయిల్ అయిన వారు అర్హులని, 18 ఏళ్ళ వయస్సు నుంచి 30 ఏళ్ళ లోపు వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆరు నెలలపాటు అందించే ఈ శిక్షణలో అభ్యర్థులకు స్టైఫండ్, అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాలకు సెల్ : 7680945357 ద్వారా ఒంగోలులోని కిమ్స్ కాలేజీ ఆఫ్ నర్సింగ్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

డీఎల్‌పీవో విచారణ


విచారణ చేస్తున్న డీఎల్‌పీవో పద్మావతి

నాగులుప్పలపాడు, మే 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో డీఎల్‌పీవో పద్మావతి శుక్రవారం విచారణ చేపట్టారు. మట్టిగుంట పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఎం.బెనహర్ ఉప్పుగుండూరులో ఇన్‌చార్జి కార్యదర్శిగా పనిచేసిన సమయంలో అవినీతికి పాల్పడినట్లు 14వ వార్డు సభ్యుడు కనగాల శ్రీనివాసరావు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డీఎల్‌పీవో ఉప్పుగుండూరు పంచాయతీ రికార్డులను స్వాధీనం చేసుకొని నాగులుప్పలపాడు పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుడు హాజరుకాక పోవడంతో విచారణ వాయిదా వేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉప్పుగుండూరు, ఈదుమూడి పంచాయితీ కార్యదర్శులు కిరణ్‌కుమార్, డీవీ.రంగారెడ్డి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగం ప్రమాదకరం


అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ సుకన్య, ఎస్ఐ నగేష్

చీమకుర్తి, మే2 (ఆంధ్రజ్యోతి): గంజాయి తదితర మాదకద్రవ్యాల వినియోగం ఆరోగ్యానికి ఎంతో ప్రమాదకరమని, వాటి వల్ల కలిగే దుష్పరిణాలపై అవగాహన కలిగి ఉండాలని ఎక్సైజ్‌శాఖ సీఐ సుకన్య పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని బండ్లమూడి గ్రామంలో గ్రామస్థులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ సుకన్య మాట్లాడుతూ గంజాయి విక్రయిస్తున్నా, రవాణా చేస్తున్నా తమకు తెలియచేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. గంజాయి, నాటుసారా తదితరాల నుంచి గ్రామస్థులు దూరంగా ఉండాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి జీవీ.శేషుకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న అభిమానులు

ఒంగోలు కార్పొరేషన్, మే 2 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి జీవీ.శేషు 80వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఊరచెరువులోని కొత్తకూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటు ఉన్న శేషు విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయన కుమారుడు జీఆర్.విమల్, అభిమానులు కె.సుధాకర్, టి. ప్రేమచంద్రరావు, వై.రాజశేఖర్, టి.రంజితమ్ జాన్ ఎడిసన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే నిజమైన సేవ


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ఒంగోలు (కల్చరల్), మే 2(ఆంధ్రజ్యోతి) : పేదల ఆకలి తీర్చడమే నిజమైన సేవ అని నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు అన్నారు. పారిశ్రామికవేత్త శిద్దా సురేష్‌బాబు జన్మదినం సందర్భంగా స్థానిక అన్నవరప్పాడులోని శివం శరణాలయంలో శుక్రవారం 300 మంది పేదలకు అన్నదానం జరిగింది. అదేవిధంగా ఆర్థికసాయం, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి, శిద్దా సురేష్‌బాబు మిత్రబృందం ముప్పారి చలమయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో యడ్లపల్లి సురేష్, గుడిపూడి అనిల్, మలినేని అశోక్, చింతం తిరుమల తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి శిక్షణ తరగతులు ప్రారంభం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న విద్యార్థినులు

ఒంగోలు(కల్చరల్), మే 2(ఆంధ్రజ్యోతి) : శ్రీనళినీప్రియ కూచిపూడి నృత్యనికేతన్ ఆధ్వర్యంలో 45 రోజులు నిర్వహించనున్న కూచిపూడి ప్రవేశిక నృత్య శిక్షణ తరగతులు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సంస్థ అధ్యక్షురాలు శివకుమారి ఆధ్వర్యంలో స్థానిక సంతపేట సాయిబాబా మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముందుగా నృత్యవిద్యార్థులు జ్యోతిప్రజ్వలన చేశారు. ముఖ్యఅతిథులుగా అళహరి చెంచలరావు, న్యాయవాది కృష్ణవేణి, ఎస్.వి.శేషయ్యలు ప్రారంభించారు. జూన్ 15వరకు తరగతులు జరుగుతాయని శివకుమారి తెలిపారు.

మహిళకు గాయాలు

మద్దిపాడు, మే 2(ఆంధ్రజ్యోతి): స్కూటీ అదుపుతప్పి మహిళకు గాయాలైన సంఘటన గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం దగ్గర శుక్రవారం జరిగింది. పర్చూరుకు చెందిన పి.ఆదిలక్ష్మి తన స్కూటీపై సింగరకొండకు వెళుతుండగా కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో ఆమెకు గాయాలు కాగా మేదరమెట్లలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

మద్దిపాడు తహసీల్దార్‌గా నారాయణరెడ్డి

మద్దిపాడు, మే 2(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు తహసీల్దార్‌గా ఎస్.నారాయణరెడ్డి శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయలో బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో సంతనూతలపాడు తహసీల్దార్‌గా, కలెక్టర్ కార్యాలయంలో ల్యాండ్ సెటిల్మెంట్ అధికారిగా పనిచేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, ఘడియపూడి గ్రామ అధ్యక్షుడు చింతల శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రెబ్బవరపు ప్రభాకర్, ఆర్ఐ పీవీ.రమణయ్య మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉచిత విద్య కోసం దరఖాస్తు చేసుకోవాలి

నాగులుప్పలపాడు, మే 2 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ప్రకారం పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లల కోసం అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత విద్య పొందేందుకు 1వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవోలు టి.రవి, ఈవీ.రమణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 25 శాతం సీట్లులో పేదలు, అర్హులైన వారికి కేటాయించినట్లు పేర్కొన్నారు. 2019 ఏప్రిల్ 2 నుంచి 2020 మే 31 మధ్య జన్మించిన వారు అర్హులని, గ్రామ సచివాలయాలు, మీసేవాకేంద్రాలు ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని వారు కోరారు.

అవీ..ఇవీ



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఉపాధి హామీ పనుల పరిశీలన

బేస్తవారపేట,మే2(ఆంధ్రజ్యోతి):మండలంలోని పాపాయిపల్లె గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఎంపీడీవో ఏవీ.రంగనాయకులు పరిశీలించారు. ఉపాధి హామీ పథకం కార్మికులకు వేతన రేటు ఎక్కువ రావాలంటే టెక్నికల్ అసిస్టెంట్ ఇచ్చిన కొలతల ప్రకారం చేయాలని తెలిపారు. కూలీలకు సంబంధించిన బీమా పథకం గురించి వివరించారు. వేసవిలో ఉదయమే పనులకు వెళ్లాలని, కొలతల ప్రకారం పనులు చేసి తగిన కూలి పొందాలని వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో ఏపీవో గురు కుమార్, టీఏ అంబటి రమేష్, రమణ,మూప్పూరి, రాము తదితరులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి వసంతోత్సవంలో భక్తులు

వేంకటేశ్వరునికి వసంతోత్సవం

కంభం, మే 2 (ఆంధ్రజ్యోతి): కంభంలో శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరి రోజు శుక్రవారం ఉదయం 6గంటలకు చక్రస్నానం, 8.30 గంటలకు వసంతోత్సవం నిర్వహించారు. రాత్రి 7గంటలకు స్వామి వారికి ఊంజల్ సేవతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయని ఆలయ పూజారి ఆంజనేయశర్మ తెలిపారు.



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవోలు

ఆధార్ కేంద్రం ప్రారంభం

గిద్దలూరు టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాచర్లగేటు సమీపంలో గల సెయింట్‌పాల్స్ విద్యాసంస్థల ఆవరణలో శుక్రవారం ఆధార్ నమోదు కేంద్రాన్ని మండల విద్యాశాఖాధికారులు కావడి వెంకటేశ్వర్లు, పోలా నాగభూషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆధార్ కార్డులో ఉన్న పేరు, తప్పులను సరి చేసుకోవడంతో పాటు ఫొటో, వేలిముద్రలు, చిరునామా, పుట్టిన తేదీ మార్పులు చేసుకోవచ్చని తెలిపారు. గిద్దలూరు ప్రాంతంలో ప్రజల ఇబ్బందులు గుర్తించిన ప్రభుత్వం ఈ అవకాశాన్ని కల్పించిందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చల్లా రమేష్‌యాదవ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



పందివానిపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన

ఎర్రగొండపాలెం రూరల్ మే 2 (ఆంధ్రజ్యోతి): రైతుల పంట పొలాల్లో భూసార పరీక్షలతో కలిగే లాభాలపై వ్యవసాయాధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం మండలంలోని పందివానిపల్లి గ్రామంలో ఏవో కేవీ శేషారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పొలాల్లో భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. పరీక్షలు చేయించడం ద్వారా కలిగే లాభాలను రైతులకు వివరించారు. గ్రామంలో అవగాహన కల్పించారు. అనంతరం పొలాల్లో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో మల్యాద్రి రెడ్డి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న న్యాయాధికారి రత్న ప్రసాద్

వేసవి శిబిరం ఎంతో ఉపయోగకరం

మార్కాపురం వన్‌టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): వేసవి శిబిరంలో కిశోర బాలికలకు నేర్పిస్తున్న ప్రతి అంశం ఎంతో ఉపయోగకరం అని జిల్లా న్యాయాధికారి రత్న ప్రసాద్ అన్నారు. స్థానిక శ్రీవిద్య కోచింగ్ సెంటర్‌లో కిశోర వికాసం వేసవి సెలవుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ బాలబాలికలు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శర్వాణి, ఐసీడీఎస్ సీడీపీఓ సుశీలా దేవి, శ్రీవిద్య ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ అంగన్‌వాడీలు, ఆశాలు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

‘పది’ ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలు భేష్

● ప్రైవేటు పాఠశాలల నుంచి చేరేందుకు విద్యార్థుల మొగ్గు



కవిత (581)

కంభం, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పశ్చిమ ప్రకాశంలో 10వ తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ప్రైవేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలు మిన్న అనే వాస్తవాన్ని గ్రహించిన విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో లక్షలు ఫీజులు కట్టి పిల్లలను చేర్పించినా ఆశించిన మేర ఫలితాలు కానరాకపోవడం, ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం అధికంగా ఉండటం ఇందుకు కారణంగా ఉంది. ప్రైవేటు యాజమాన్యాలు తల్లిదండ్రుల వద్ద వేలకు వేలు ఫీజులు వసూలు చేయడం, పబ్లిసిటీపై ఉన్న శ్రద్ధ చదువులపై చూపకపోవడంతో ఈ విద్యాసంవత్సరం ఎక్కువ శాతం ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపే అవకాశం కనిపిస్తోంది.

సమస్యలపై దృష్టి సారించాలి

మార్కాపురం డివిజన్‌లో ప్రభుత్వ, జడ్పీ పాఠశాలల్లో ఫర్నిచర్ , తరగతి గదులు , ఉపాధ్యాయులు, క్రీడామైదానాల కొరత వేధిస్తున్నది. గత 5 సంవత్సరాల వైసీపీ పాలనలో విద్యావ్యవస్థను పట్టించుకోక పోవడమే ఇందుకు ప్రధాన కారణమని విమర్శలు వస్తున్నాయి. కంభం బాలికోన్నత పాఠశాలలో 540 మంది విద్యార్థినులు, 24 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఈపాఠశాలలో తాగునీటి సమస్యతో పాటు ఆటలు ఆడేందుకు క్రీడామైదానం లేదు. నీటి సమస్యతో మరుగుదొడ్లను ఉపయోగించలేని పరిస్థితి. ఇన్ని సమస్యలున్నా ఈపాఠశాలలో కనక కవిత 581, కె.సుశ్మిత, కె.సుహాన 578, షేక్ నూర్జహాన్ 576 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో టాపర్లుగా నిలిచారు. కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 500 మంది విద్యార్థులు ఉండగా కూర్చునేందుకు బల్లలు లేవు. ఉపాధ్యాయుల కొరత వేధిస్తున్నది. అర్థవీడు బాలుర గురుకుల పాఠశాలల్లో 10వ తరగతిలో 45 మంది విద్యార్థులు ఉండగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. కంభం బాలికల గురుకుల పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేష్ చొరవ తీసుకుని పాఠశాలలు ప్రారంభమయ్యే సమయానికి ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



కంభం బాలికోన్నత పాఠశాల

కంభం ఎంఈవో మాల్యాద్రిని వివరణ కోరగా ఈ విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 10వ తరగతి విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించారని, అయితే ఉపాధ్యాయుల కొరత, క్రీడాప్రాంగణాలు లేకపోవడం, నీటి సమస్య వంటివి తీరుస్తామని తెలిపారు

వైభవంగా తిరునక్షత్ర మహోత్సవం





లక్షమల్లెల పూజలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్లో) రామానుజాచార్యుల మూలవిరాట్

మార్కాపురం వన్‌టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయంలో శ్రీభగవత్ రామానుజాచార్యుల తిరునక్షత్ర మహోత్సవం శుక్రవారం భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవస్వామి ఆలయంలోని రామానుజాచార్యుల మూలవిరాట్‌కు ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం లక్ష మల్లెల అర్చన నిర్వహించారు. శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి యతిరాజ సేవా సంఘం, శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి వికాస తరంగిణి ఆధ్వర్యంలో మహిళలు భజనలు చేశారు. ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో శంకరాచార్యుల జయంతి



పూజల్లో పాల్గొన్న భక్తులు

మార్కాపురం వన్‌టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి మార్కాపురం పట్టణంలోని శివాలయంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు సోమయాజులు హరిప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో శంకరాచార్యుల మూలవిరాట్‌కు శుక్రవారం అభిషేకాలు నిర్వహించారు. శంకరాచార్యుల ఉత్సవమూర్తికి రుద్రాభిషేకం, షోడశ పూజ, పాదుక పూజ, గణపతి హోమం, రుద్రహోమం, నవగ్రహ హోమం నిర్వహించారు. అనంతరం మహాపూర్ణాహుతి, సామూహిక ఉచిత ఉపనయనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ ప్రముఖులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెంలో..

ఎర్రగొండపాలెం : జగద్గురువు ఆది శంకర స్వామి జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక శివాలయంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ఆది శంకర స్వామి జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు. ముందుగా ఆలయంలో అర్చకులు రెంటచింతల శ్రీరామ చంద్రమూర్తి, పసుమాముల మృత్యుంజయ శాస్త్రి, దేవలపల్లి మంజునాథ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు యోగేశ్వరరావు, విశ్రాంత డిప్యూటి తహసీల్దారు తాళ్ళపల్లి ప్రసాద్, శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

అమరావతి పునఃప్రారంభం విజయవంతం

- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



కంభం నుంచి అమరావతికి తరలివెళుతున్న కూటమి నేతలు

గిద్దలూరు టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి పునఃప్రారంభ కార్యక్రమం విజయ వంతంగా జరగడం శుభప్రదమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం వెలగలపూడి సమీపంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభ పునర్ నిర్మాణ ప్రారంభ కార్యక్రమాలు విజయవంతం కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి గిద్దలూరు నియోజకవర్గం నుంచి ఆర్టీసీ బస్సుల్లో, ప్రత్యేక వాహనాలతోపాటు పార్టీ శ్రేణులు సొంత వాహనాల్లో తరలి వచ్చారని తెలిపారు.

కంభం నుంచి..



మార్కాపురం పట్టణం నుంచి అమరావతికి తరలుతున్న బీజేపీ నాయకులు

కంభం : ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభకు కంభం నుంచి 2 బస్సులు బయలుదేరినట్లు ఎంపీడీవో వీరభద్రాచారి తెలిపారు. అమరావతికి వెళ్లే ప్రయాణికులకు టిఫిన్, వాటర్, ఓఆర్ఎస్, 2 పూటలా భోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మార్కాపురం నుంచి..

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం నుంచి బీజేపీ నాయకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణారావు, షబానా, శ్రీనివాస్ చౌదరి, కరీమ్ బాషా, సతీష్ కుమార్, శివప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ నుంచి..

మార్కాపురం రూరల్: మండలంలోని పెద్ద యాచవరం, చింతగుంట్ల, రాయవరం గ్రామాల నుంచి శుక్రవారం కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు మూడు బస్సులలో ఆయా గ్రామాల నుంచి తరలివెళ్లారు.

పెద్దారవీడు నుంచి

పెద్దారవీడు: ఏపీ రాజధాని అమరావతి నిర్మాణ పునః శంకుస్థాపనకు మండలం నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, ప్రభుత్వ అధికారులు భారీగా తరలి వెళ్లారు. మండలంలోని దేవరాజుగట్టులోని ప్రధాన కూడలికి అన్నీ గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేరుకొని సమైక్యంగా అమరావతికి బయలుదేరి వెళ్లారు. టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆదేశాల మేరకు పార్టీ మండలాధ్యక్షుడు మెట్టు శ్రీనివాసులరెడ్డి అన్నీ గ్రామాల నాయకులను సమన్వయం చేసుకొని రెండు బస్సులు, 30 ప్రైవేటు వాహనాలలో బయలుదేరి వెళ్లారు.

ఎర్రగొండపాలెం నుంచి..

ఎర్రగొండపాలెం: మండలం నుంచి 500 మందికిపైగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు బస్సులలో, జీపులలో మోదీ సభకు తరలివెళ్లారు. 5 బస్సులు, 20 పైగా తుపాన్ వాహనాలు, కార్లలో వెళ్లారు. త్రిపురాంతకం మండలం నుంచి అమరావతి పునర్నిర్మాణ సభకు శుక్రవారం ఉదయం టీడీపీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరివెళ్లారు. మండల టీడీపీ అధ్యక్షుడు మేకల వశరాజు, మాజీ అధ్యక్షుడు ఎం. శ్రీనివాసరెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు దేవినేని చలమయ్య, దూపాడు మాజీ సర్పంచ్ ఆళ్ళ నాసర రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పుల్లలచెరువు నుంచి మోదీసభకు తరలివెళ్తున్న టీడీపీ నాయకులు

పుల్లలచెరువు నుంచి..

పుల్లలచెరువు : అమరావతి సభకు పుల్లలచెరువు మండలం నుంచి టీడీపీ ,బీజేపీ నాయకులు తరలివెళ్లారు.శుక్రవారం పుల్లలచెరువు నుంచి రెండు బస్సుల్లో కూటమి నేతలు, కార్యకర్తలు తరలివెళ్లినట్లు తహసీల్దారు కె. వెంకటేశ్వర్లు, టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్ తెలిపారు.



పెద్దారవీడు నుంచి వెళుతున్న టీడీపీ నాయకులు, అధికారులు



కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజమోహన్‌రావు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మార్కాపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రజలు చట్టాలపట్ల అవగాహన కలిగి ఉండాలని మార్కాపురం టౌన్ ఎస్సై డాక్టర్ ఎం.రాజమోహన్‌రావు అన్నారు. స్థానిక నాగులవరం రోడ్డులోని రాజ్యలక్ష్మి కాలనీలో శుక్రవారం ముందస్తు చర్యల్లో భాగంగా ప్రజలకు చట్టాలపై, ప్రస్తుత సమాజంలో జరుగుతున్న మోసాలు, నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజమోహన్‌రావు మాట్లాడుతూ సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మొబైల్ ఫోన్లకు ఎలాంటి ఓటీపీలు వచ్చినా, బ్యాంకు వివరాలు ఎవరు అడిగినా చెప్పరాదన్నారు. మత్తు పదార్థాలు, మద్యం బెల్ట్ దుకాణాలు ఎవరైనా వినియోగిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. తక్కువ వడ్డీకి రుణాలిస్తామని సూక్ష్మరుణ సంస్థల సిబ్బంది ఎవరైనా వస్తే తమకు తెలియజేయాలన్నారు. వేసవిలో ఆరుబయట బంగారు ఆభరణాలు ధరించి నిద్రించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



నరసాయపాలెంలో నీటి తొట్లను పరిశీలిస్తున్న ఏపీడీ

నీటి తొట్లు పశువులకు చలివేంద్రాలు

● ఏపీడీ నిర్మలా దేవి

ఎర్రగొండపాలెం రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): పశువులకు చలివేంద్రాలుగా నీటి తొట్లు ఉపయోగ పడుతున్నాయని మార్కాపురం ఏపీడీ నిర్మలాదేవి అన్నారు. మండలంలోని నరసాయపాలెం గ్రామంలో నిర్మించిన నీటి తొట్లను ఆమె శుక్రవారం పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాలలో ఉండే పశువులకు, మూగ జీవాలకు దాహార్తిని తీర్చేందుకు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. నీటి తొట్లలో నీరు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ముందుగా గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె పరిశీలించి శ్రామికులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అమె వెంట ఏపీవో శైలజ, టెక్నికల్ అసిస్టెంట్ రాణి, ఎఫ్ఏ హనుమంతరావు, సిబ్బంది ఉన్నారు.

చిన్నకండ్లేరు అనుసంధానానికి నిధులు కేటాయించాలి

పుల్లలచెరువు, మే 2(ఆంధ్రజ్యోతి):వెలిగొండ ప్రాజెక్టు ద్వారా తీగలేరును పుల్లలచెరువు చిన్న కండ్లేరుకు అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని నాయకులు కోరారు. శుక్రవారం పుల్లలచెరువు మండలంలోని సుద్దకురువ తండాలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని,తీగలేరును చిన్న కండ్లేరుకు అనుసంధానం చేయాలని రైతులతో కలిసి సంతకాల సేకరణ, పోస్టు కార్డులపై రాసి రాష్ట్ర సీఎం చంద్రబాబుకు పంపించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శాశ్వతంగా కరువు పోవాలంటే వెలిగొండ ప్రాజెక్టు తీగలేరు 5 కాలువను పుల్లలచెరువులోని చిన్న కండ్లేరు రిజర్వాయరు వరకు పొడిగించాలని అన్నారు.పుల్లలచెరువు మండలంలో సాగు ,తాగు నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.తీగలేరు కాలువ ఎర్రగొండపాలెం మండలం వరకే ప్రస్తుతం ఉందని కాలువ పనులు వెంటనే ప్రారంభించి పుల్లలచెరువు చిన్న కండ్లేరుకు అనుసంధానం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జీవీ గురునాథం, రైతు సంఘం నాయకులు జానకీ రఘు, సర్పంచ్ వెంకటేశ్వరనాయక్ రైతులు పాల్గొన్నారు.



రాయవరం గ్రామంలో సమ్మర్ కిశోర వికాసం కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సాయి చరణ్ తేజ

రాయవరంలో కిశోర వికాసం

మార్కాపురం రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి). మండలంలోని రాయవరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద కిశోర వికాసం సమ్మర్ క్యాంప్ కార్యక్రమం శుక్రవారం ఐసీడీఎస్ , వెలుగు, వైదశాఖల ఆధ్వర్యంలో అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్జలకొండ పీహెచ్‌సీ కేంద్రం వైద్యులు డాక్టర్ సాయి చరణ్ తేజ మాట్లాడుతూ ముఖ్యంగా బాలికల్లో కిశోర వయస్సు సమయంలో జరిగే మార్పులను తల్లి దండ్రులు గమనించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం పిచ్చయ్య మాట్లాడుతూ ఆడపిల్లలకు బాల్యవివాహాలు జరిపితే ప్రభుత్వ కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పిల్లలను ఉన్నతంగా చదివించి వారి జీవితం మంచి స్థాయికి చేరుకునేలా వారికి అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో శ్రీకాంత్, వెలుగు ఎల్‌సీ నాగ భూషణం, వైద్యసిబ్బంది కమలమ్మ, సుస్మిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత సలోమి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే బాలికల వికాసం

పెద్దదోర్నాల, :ఉన్నత విద్య ద్వారానే బాలికల వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని సీడీపీవో కమల కుమారి అన్నారు. మండలంలోని తిమ్మాపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యక్రమాన్ని శుక్రవారం నిరహించారు.ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాలికలు శుభ్రమైన జీవనశైలిని అవలంబిస్తూ క్రమశిక్షణతో పెద్ద చదువులు చదవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ అంజమ్మ, కార్యకర్తలు సుహాసిని, రామలక్ష్మి కుమారి, రాణి ఏఎన్‌ఎం స్వర్ణలత, మహిళా పోలీసు అనంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు 30 పోలీసు యాక్ట్ అమలు

మార్కాపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 31వ తేదీ వరకు 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు తెలిపారు. ఈ యాక్ట్ అమల్లో ఉన్న సమయంలో సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడా ఎలాంటి సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలు, ఆందోళనలు చేయాలన్నా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగినా, ప్రభుత్వ ఆస్తులకు భంగం కలిగించే విధంగా ఎవరు వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆయుష్ జిల్లా నియంత్రణాధికారిగా
డాక్టర్ ఏడుకొండలు



పామూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆయుష్ ఔషధ నియంత్రణ, తనిఖీ అధికారిగా కంబాలదిన్నె ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ గద్దె ఏడుకొండలు నియమితులయ్యారు. రాష్ట్ర ఆయుష్ శాఖ కార్యదర్శి శుక్రవారం జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం డాక్టర్ ఏడుకొండలుకు అదనపు బాధ్యతలు కేటాయించారు. ఈసందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. టీడీపీ నాయకుడు ఉప్పలపాటి హరిబాబు డాక్టర్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వాయునేని మాధవ, బండ్ల నారాయణ, ఈర్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మజ్జిగ కేంద్రం ప్రారంభం

పామూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): పాదచారుల దాహార్తి తీర్చేందుకు దృశ్య స్వయంకృషిసేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ కేంద్రం ఏర్పాటుచేయడం అభినందనీయమని టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని సీఎస్‌పురం రోడ్డులో శుక్రవారం ఆయన ఉచిత మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సేవాసంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్, సర్పంచ్ సుబ్బయ్య, ఉపసర్పంచ్ కందుల శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ శిక్షణ ప్రారంభం

పామూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లా క్రీడాభివృద్ధి ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సెయింట్ మార్క్స్ స్కూల్‌లో ఉచిత బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ఎం.జయకుమార్ తెలిపారు. ఈనెలాఖరు వరకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ జరుగుతుందని తెలిపారు. ఈఅవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రాజెక్టు అధికారికి సన్మానం

పామూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్, వెలిగండ్ల ప్రాజెక్టు అధికారిగా నియమితులైన దేవకృపావరంను పామూరు అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం సన్మానించారు. జిల్లా అధికారి ఉత్తర్వుల మేరకు సీడీపీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా స్థానిక స్వయంకృషి సేవా సంస్థ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో సేవా సంస్థ అధ్యక్షుడు నాయబ్‌రసూల్, అంగన్‌వాడీలు అనిత, రామసుబ్బులు, పార్వతి, ఝాన్సీలక్ష్మీబాయి, నాగవాణి, తదితరులు పాల్గొన్నారు.

లోక కల్యాణమే కృష్ణావతార పరమార్థం

ఒంగోలు(కల్చరల్), మే 2(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణం కోసమే విష్ణు మూర్తి శ్రీకృష్ణునిగా అవతారం దాల్చాడని, ఆయన బోధించిన భగవద్గీత ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని ప్రముఖవాస్తు, జ్యోతిష్య సిద్ధాంతి, ఆధ్యాత్మిక ప్రవచకులు అగస్త్యరాజు శివసుబ్రహ్మణ్య శర్మ పేర్కొన్నారు. శుక్రవారం రా త్రి స్థానిక వీఐపీరోడ్‌లోని జాతీయ పద్యసారస్వత పరిషత్‌లో ఏర్పాటు చే సిన కార్యక్రమంలో ఆయన శ్రీకృష్ణలీలలు అనే అంశంపై ప్రవచనం చేశారు. శ్రీకృష్ణ జననం, బాలకృష్ణుని లీలలు తదితర విషయాలను ఆయన సోదా హరణంగా పోతన భాగవత పద్యాలతో వివరించారు. అనంతరం పరిషత్ గౌరవ అధ్యక్షులు చదలవాడ నరసింహారావు, కార్యదర్శి పింగళి పూర్ణచం ద్రరావు, కమిటీ సభ్యులు శివసుబ్రహ్మణ్యంను ఘనంగా సత్కరించారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 2 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖ పరిధిలో పని చేస్తున్న కమ్యూ నిటీ హెల్త్‌ఆఫీసర్ల (సీహెచ్‌వో) సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలె క్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శుక్ర వారానికి నాల్గవ రోజుకు చేరింది. ఈ సంద ర్భంగా రాష్ట్ర నాయకుడు మందరగిరి రాజేష్ మాట్లాడుతూ కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ల స మస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం ని ర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు 23శాతం ఇంక్రి మెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశా రు. ముఖ హాజరు నుంచి మినహాయింపు ఇ వ్వడంతో పాటు సీహెచ్‌వోలను రెగ్యులర్ చే యాలని కోరారు. చాలీచాలని జీతాలతో కు టుంబ పోషణ కష్టతరంగా ఉందని, అందువ ల్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరిం చాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మ రింత ఉధృతం చేయాల్సి వస్తోందని హెచ్చరిం చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నిర్మల, కార్యదర్శి ప్రసన్న, దీప్తి, కామేష్, నవీన్, రా మాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

మద్దిపాడు, మే 2(ఆంధ్రజ్యోతి): స్కూటీ అదుపుతప్పి మహిళకు గాయాలైన సంఘటన గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం దగ్గర శుక్రవారం జరిగింది. పర్చూరుకు చెందిన పి.ఆదిలక్ష్మి తన స్కూటీపై సింగరకొండకు వెళుతుండగా కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో ఆమెకు గాయాలు కాగా మేదరమెట్లలోని ప్రై వేటు వైద్యశాలకు తరలించారు.

అమరావతికి భారీగా తరలివెళ్లిన శ్రేణులు

కనిగిరి, మే 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి పనుల పునఃప్రారంభ కార్యక్రమానికి అందరం ఒక్కటై అన్నట్లుగా కనిగిరి ప్రాంతంలోని నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివెళ్లారు. 2014 నుంచి 2019 వరకు అమరావతి అభివృద్ధి పనులు వేగంగా జరిగాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్ర భుత్వం అమరావతిని అభివృద్ధి చేయకపోగా చేసిన పనులను ఎక్కడికక్కడే ఇదిలి వేయటంతో సామగ్రితో పాటు కట్టడాలు దెబ్బతిన్నాయి. వెరసి ప్రజలపై ఎంతో భారం పడింది. 2024లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తిరిగి అమరావతి పనులు పునఃప్రారంభానికి పూనుకున్నారు. శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పనులను ప్రారంభం చేయనుండటంతో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. కనిగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలతో పది బస్సులు, వందకు పైగా ప్రైవేటు వాహనాల్లో మోదీ సభకు తరలివెళ్లారు. తహసీల్దార్ రవిశంకర్ నేతృత్వంలో శుక్రవారం ఉదయం నుంచి బస్సుల్లో ప్రజలు తరలివెళ్లారు. ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి పర్యవేక్షించారు.



కనిగిరి నుంచి బస్సుల్లో సభకు తరలివెళుతున్న నాయకులు

దర్శి: అమరావతిలో శుక్రవారం జరిగిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అధికసంఖ్యలో తరలివెళ్లారు. మండలం నుండి 35 బస్సుల్లో నాయకులు, కార్యకర్తలు బయలుదేరివెళ్లారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభించేందుకు మోదీ రావటం ఆనందదాయకమన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్ష నెరవేరబోతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం అమరావతి రాజధాని నిర్మాణం శరవేగంతో పూర్తవుతుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. తరలివెళ్లినవారిలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, శోభారాణి, మారెళ్ల వెంకటేశ్వర్లు, యాదగిరి వాసు, సంగా తిరుపతిరావు, తదితరులు ఉన్నారు.

ముండ్లమూరు: అమరావతి సభకు బయలుదేరిన బస్సులను ఎంపీడీవో ఆర్.జనార్దన్, డిప్యూటీ తహసీల్దా ర్ ఆర్.శ్రీకాంత్, మండలస్థాయి అధికారులు శంకరాపురం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. అమరావతికి త రలి వెళ్లినవారిలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, కొక్కెర నాగరా జు, వరగాని పౌలు, కోడెగ మస్తాన్‌రావు, తదితరులు ఉన్నారు.

దొనకొండ: అమరావతిలో శుక్రవారం జరిగిన సభకు మండలంలోని టీడీపీ నాయకులు అధికసంఖ్యలో తరలివెళ్లారు. తరలివెళ్లినవారిలో టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, పులిమి రమణాయాదవ్, కొత్తం రఘునాథరెడ్డి, వీరపనేని వెంకన్నచౌదరి, కామేపల్లి చెంచయ్య, వల్లపునేని వెంకటస్వామి, తదితరులు ఉన్నారు.

పీసీపల్లి: అమరావతిలో జరిగిన కార్యక్రమానికి మండలం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. తహసీల్దార్ ఉష, ఎంపీడీవో ప్రభాకరశర్మ, డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్ తదితరులు బస్సులు అమరావతికి బయలుదేరే వరకు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పామూరు: ఆంధ్రుల రాజధాని అమరావతి పునః ప్రారంభ వేడుక కార్యక్రమానికి పామూరు నుంచి కూటమి నాయకులు ప్రత్యేక వాహనాలలో తరలివెళ్లారు. పట్టణంలోని అయ్యప్పస్వామి దేవస్థానం వద్ద నుంచి బయలుదేరిన బస్సును బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య జెండా ఊపి ప్రారంభించారు.

తాళ్లూరు: అమరావతి సభకు మండలం నుంచి భారీగా తరలివెళ్లారు. మండలంలోని గ్రామాలకు ఏర్పాటుచేసిన వాహనాలు స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకున్నాయి. మండలంలోని టీడీపీ, జనసేన శ్రేణులు, పొదుపు మహిళలు ప్రత్యేక వాహనాల్లో, కార్లలో తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. అమరావతికి తరలివెళ్లిన వారిలో ఎంపీపీ తాటికొండ శ్రీను, మానం రమేష్‌బాబు, శాగం కొండారెడ్డి, పెదకాలేషావలి, మారిశెట్టి హనుమంతరావు, తదితరులు ఉన్నారు.


తాళ్లూరు: అమరావతికి తరలివెళుతున్న నాయకులు

పోరాటాల ద్వారానే హక్కుల సాధన

» యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

దర్శి, మే 2(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్సీ డి.రామిరెడ్డి ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. రామిరెడ్డి వర్ధంతి సందర్భంగా శుక్రవారం దర్శిలో ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. పోరాటాల ద్వారానే హక్కులను సాధించటం సాధ్యమన్నారు. ప్రభుత్వ బడులను రక్షించుకునేందుకు విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సమసమాజ స్థాపన కోసం యూటీఎఫ్ నిరంతరం పనిచేస్తుందని అన్నారు.



రామిరెడ్డి వర్ధంతి సభలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

కాగా, మాజీ ఎమ్మెల్సీ రామిరెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన మంచినీటి చలివేంద్రాన్ని నక్కా వెంకటేశ్వర్లు ప్రారంభించారు కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్, ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, గౌరవాధ్యక్షుడు ఎస్.రవి, ఎంఈవోలు కె.రఘురామయ్య, రమాదేవి, జిల్లా కార్యదర్శి మీనగ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బాలికల భవిష్యత్తుకు పునాది
'కిశోరి వికాసం'


పామూరు: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పద్మజ

పామూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): బాలికల బంగారు భవిష్యత్తుకు కిశోరి వికాసం కార్యక్రమం పునాది వేస్తుందని సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ తెలిపారు. మండలంలోని బుక్కాపురం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం వేసవి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వారంలో రెండురోజులు ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బాలికలకు 18 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహాలు చేయాలన్నారు.

బాలికలు అవగాహన పెంచుకోవాలి

కనిగిరి, మే 2 (ఆంధ్రజ్యోతి): వివిధ అంశాలపై బాలికలు అవగాహన పెంచుకోవాలని మహిళా సంరక్షణా కార్యదర్శి కె.శాంతి అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సూపర్‌వైజర్ పార్వతమ్మ అధ్యక్షతన గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై బాలికలకు అవగాహన కల్పించారు.

ఈసందర్భంగా శాంతి మాట్లాడుతూ కిశోరి వికాసం కార్యక్రమాన్ని జూన్ పదో తేదీవరకు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కిశోరి బాలికలకు వ్యక్తిగత జీవన శైలి, పరిశుభ్రత, తోటివారి ప్రవర్తనపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. కౌమార దశలో బాలికలలో కలిగే సమస్యలు, వ్యక్తిగత పరిశుభ్రత, తీసుకోవాల్సిన పోషకాహారం, తదితర అంశాలను వివరించారు.

కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పి.కల్యాణి, ఎం.రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల దాహార్తి తీరుస్తున్న నీటి తొట్లు

ముండ్లమూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన నీటి తొట్లు పశువుల దాహార్తి తీరుస్తున్నాయి. వేసవికాలంలో ప్రతి పంచాయతీలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు ఒకటి నుంచి మూడు తొట్ల వరకు నిర్మించారు. మేత కోసం పొలం వెళ్ళిన మూగ జీవాలు దాహార్తి తీర్చుకోవటానికి ఇవి ఎంతో ఉపయోగంగా మారాయి.

వేసవి కాలం ప్రారంభమవటంతో మేత కోసం వెళ్ళిన పశువులు నిన్నమొన్నటి వరకు నీటికోసం ఇబ్బందులుపడ్డాయి. మధ్యాహ్నానికే ఇంటి మొఖం పట్టేవి. గత 15 రోజులుగా మూగజీవాల కోసం నిర్మించిన నీటి తొట్లతో దాహం తీర్చుకుంటున్నాయి. మండలంలో 45 నీటి తొట్లు నిర్మించారు. ఒక్కో నీటి తొట్టికి ఉపాధి హామీ పథకం ద్వారా రూ.45 వేలు వెచ్చించారు. మండలంలోని పసుపుగల్లులో నిర్మించిన మూడు తొట్లు మూగ జీవాలకు ఎంతో ఉపయోగకరంగా మారాయి.


పసుపుగల్లులో నీటి తొట్టి వద్ద దాహం తీర్చుకుంటున్న గేదెలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

దొనకొండ, మే 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈఘటన గురువారం అర్ధరాత్రి మండలంలోని ఆరవల్లిపాడు గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. మల్లంపేట గ్రామానికి చెందిన పోలు రతానియేలు (21), మరియబాబు ద్విచక్ర వాహనంపై కొనకనమిట్ల మండలం సిద్ధవరం గ్రామానికి పనిమీద వెళ్తున్నారు. ఈక్రమంలో ఆరవల్లిపాడు గ్రామ సమీపంలో రోడ్డుపై గేదె అడ్డువచ్చి కొమ్ము విసిరింది. దీంతో మోటారుసైకిల్ అదుపుతప్పి కిందపడ్డారు. గేదె కొమ్ము రతానియేలు గుండె వద్ద పొడుచుకోవడంతో తీవ్ర రక్తస్రావమై అపస్మారక స్థితిలో పడిపోయాడు. వెనుక కూర్చున్న యువకుడు మరియబాబు తేరుకొని 108కు సమాచారం అందించటంతో ఘటనాస్థలికి చేరుకొన్నారు. క్షతగాత్రుడిని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఎస్ఐ త్యాగరాజు మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతిచెందిన రతానియేలు(ఫైల్)

మల్లంపేట గ్రామానికి చెందిన పోలు చిన్ననర్సయ్య, కోటమ్మల ఇద్దరు కుమారుల్లో పెద్ద కుమారుడు కుమార్ సర్పంచ్‌కాగా, రెండవ కుమారుడు రతానియేలు. అందరితో మంచిగా ఉండే రతానియేలు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడనే సమాచారంతో కుటుంబ సభ్యులు, బంధువుల గుండెలవిసేలా రోదిస్తున్నారు. శోకసంద్రంలో గ్రామం మునిగిపోయింది.

గృహనిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలి

తాళ్లూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): గృహనిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని హౌసింగ్‌శాఖ ఎంఐసీ హనుమంతరావు పేర్కొన్నారు. తాళ్లూరులో అసంపూర్తిగా ఉన్న ఎన్టీఆర్ గృహసముదాయాలను శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న 61 గృహాలను మన ఇల్లు-మన గౌరవం కింద త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎస్సీ, బీసీల గృహాలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనంగా ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. ఈఅవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని జూన్1లోగా గృహాలను పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మేంద్రస్వామి వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో గోవిందమాంబ బ్రహ్మేంద్రస్వామి

దొనకొండ, మే 2(ఆంధ్రజ్యోతి): స్థానిక అడ్డరోడ్డు సెంటర్‌లోని ఆనంద ఆశ్రమంలో వెలసిన శ్రీబ్రహ్మేంద్రస్వామి 11వ వార్షికోత్సవ వేడుకలు ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి నేతృత్వంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం పంచామృత అభిషేకాలు, గోవిందమాంబ వీరబ్రహ్మేంద్ర స్వాముల వార్ల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈవేడుకలకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. రాత్రి కోలాటం, బ్రహ్మంగారి నాటకం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన


వర్మీ కంపోస్టును పరిశీలిస్తున్న డీఎల్‌పీవో హనుమంతరావు, తదితరులు

పీసీపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుదేవారిపాలెంలో చెత్తసంపద కేంద్రాన్ని శుక్రవారం డీఎల్‌పీవో హనుమంతరావు పరిశీలించారు. ఈసందర్భంగా గ్రీన్ అంబాసిడర్లకు పలు సూచనలు చేశారు. షెడ్‌లోని నాడప్ తొట్లలో తడి, పొడి చెత్తలను వేర్వేరుగా వేయాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లు ప్రతిరోజు గ్రామాల్లోని చెత్తను చెత్తసంపద కేంద్రాలకు తరలించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు సర్టిఫికెట్ కోర్సులలో శిక్షణ

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బొల్లినేని మెడిస్కిల్స్ ఆధ్వర్యంలో డిగ్రీ చదివిన విద్యార్థులకు స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సులను అందిస్తున్నట్లు సంస్థ సీహెచ్.నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య రంగంలో నైపుణ్యాలను అందించే ఈ సర్టిఫికెట్ కోర్సుకు డిగ్రీ పాస్ / ఫెయిల్ అయిన వారు అర్హులని, 18 ఏళ్ల వయస్సు నుంచి 30 ఏళ్ల లోపు వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆరు నెలలపాటు అందించే ఈ శిక్షణలో అభ్యర్థులకు స్టైఫండ్, అనంతరం ఉద్యోగ అవకాశాలు కలిసామని పేర్కొన్నారు. వివరాలకు సెల్ : 7680945357 ద్వారా ఒంగోలులోని కిమ్స్ కాలేజీ ఆఫ్ నర్సింగ్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

నాలుగో రోజుకు చేరిన నిరవధిక సమ్మె

ఒంగోలు కలెక్టరేట్, మే 2 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖ పరిధిలో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ల (సీహెచ్‌వో) సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి నాల్గవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు మందరగిరి రాజేష్ మాట్లాడుతూ కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ల సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు 23శాతం ఇంక్రిమెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ముఖ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వడంతో పాటు సీహెచ్‌వోలను రెగ్యులర్ చేయాలని కోరారు. చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ కష్టతరంగా ఉందని, అందువల్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నిర్మల, కార్యదర్శి ప్రసన్న, దీప్తి, కామేష్, నవీన్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా కులగణనను స్వాగతిస్తున్నాం

ఒంగోలు కలెక్టరేట్, మే 2 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నట్లు పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మంచి పుస్తకం షాపు వద్ద శుక్రవారం బీసీ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ గుంటూరు మస్తాన్‌రావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని బీసీ సంఘాలన్నీ ఓ కమిటీగా ఏర్పడి ఆందోళనలు చేపట్టినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో కులగణన చేస్తామని ప్రకటించిదని, దాని అమలును సత్వరమే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ అజీజ్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తాటపర్తి వెంకటస్వామి, చావలి సుదాకర్, పేరయ్య, బి.సుబ్బారావు, శివరావు, ఏవీ.సుబ్రహ్మణ్యం, మిరియం అంజిబాబు, అంజనేయులు, కె.పెద్దన్న, మాచరవపు రామాంజనేయులు, వీరభద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

కగార్ ఆపరేషన్‌ను నిలుపుదల చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 2 (ఆంధ్రజ్యోతి): కగార్ ఆపరేషన్‌ను నిలుపుదల చేసి మావోయిస్టు పార్టీతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.మోహన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దండకారణ్యంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రప్రభుత్వం చేపట్టిన కగార్ ఆపరేషన్‌ను నిలుపుదల చేయాలని, దీనివల్ల 237 గ్రామాలకు చెందిన 35వేల ఆదివాసీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఈ దాడులను నిలుపుదల చేయాలని కోరారు.


సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొండారెడ్డి, ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్, సంయుక్త కిసాన్‌మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావులు ధర్నాకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బి.సుబ్బారావు, కోటి, పద్మ, నాంచార్లు, రాజశేఖర్, జాలన్న తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 2 (ఆంధ్రజ్యోతి): ట్రెజరీ శాఖలో అనేక సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ నాయకులు కోరారు. ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కమిటీ నాయకులు శుక్రవారం స్థానిక రామనగర్‌లోని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌వీకృష్ణ, పి.అంకబాబుల ఆధ్వర్యంలో ఎంపీ మాగుంటకు బొకే అందజేసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలో ట్రెజరీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు.

కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పీవీఎల్ఎన్.వరకుమార్, కె.రామకృష్ణ, కె.లావణ్య, బి.అక్కేశ్వరరావు, ఎస్‌కే.కరీముల్లా, కె.వెంకటేశ్వర్లు, పి.హేమలత, కె.ప్రసాద్‌చంద్ర, డి.అనిల్, సీహెచ్ ఫణీంద్ర, కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.







1 అభివృద్ధి.. అంటే చంద్రబాబు

అభివృద్ధి చేయడం అంటే చంద్రబాబును చూసి నేర్చుకోవాలని ప్రధాని మోదీ తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు నాయుడు అప్పట్లోనే టెక్నాలజీని అభివృద్ధి చేశారన్నారు. తాను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన టెక్నాలజీని పరిశీలించేందుకు అధికారుల బృందాన్ని సైబరాబాద్ పంపానన్నారు..



భానుడు భగభగమంటున్నా.. అమరావతి పండుగకు తరలివచ్చిన వారిని చూస్తే కలల రాజధానిపై ప్రజల్లో మమకారం ఏమాత్రం తగ్గలేదని అర్థమవుతోంది. వినాశనం నుంచి వికాసం దిశగా పయనిస్తోన్న అమరావతి అభివృద్ధికి జనం జయజయధ్వానాలు.. నేతల చప్పట్ల మధ్య ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం శంకుస్థాపన చేశారు. అమరావతి అత్యద్భుత అభివృద్ధిలో భాగస్వామ్యం అవు తామని నేతలు ప్రతినపూనగా.. జై అమరావతి.. జైజై అమరావతి నినాదాలతో జనం హోరెత్తించారు. అమరావతి పునర్నిర్మాణ మహోత్సవాన్ని రాజధాని గ్రామాల వాసులు ఓ పండుగగా భావించగా.. రాష్ట్ర నలుమూలల నుంచి జనం జాతరకు తరలివచ్చినట్లుగా వచ్చారు. దీంతో శుక్రవారం రాజధాని గ్రామాలతో పాటు వెలగపూడి జనసంద్రంగా మారింది. నేతల నుంచి సామాన్య ప్రజల వరకు ఎవరూ ఎటువంటి ఇబ్బంది పడకుండా అధికారులు ఏర్పాట్లు చేయడంతో కార్యక్రమం విజయవం తంగా సాగింది. అమరావతి ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో కాదని ఈ సభ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. మూడేళ్లలో అమరావతి నిర్మాణం జరుగుతుందని.. రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందని ప్రధాని మోదీ తన ప్రసంగంలో చెప్పడంతో అటు నేతలు.. ఇటు ప్రజల్లో సంతోషం వెల్లివిరిసింది.

- నినదించిన జనం.. నేతలు
- హోరెత్తిన రాజధాని గ్రామాలు
- జన జాతరను తలపించిన వెలగపూడి
- పునఃనిర్మాణానికి భారీగా తరలివచ్చిన ప్రజలు
- మేళతాళాలతో రాజధాని రైతులు, మహిళల ఆహ్వానం
- మంగళగిరి నుంచి వెలగపూడి వరకూ ట్రాఫిక్ దిగ్బంధనం

..జై అమరావతి



అమరావతి.. ఆకాంక్ష

వెలగపూడి సభ సాక్షిగా కలల రాజధాని అమరావతిపై అన్నివర్గాల్లోనూ అభిమానం ద్విగిణీకృతమైంది. అమరావతిని చూడాలన్న ఆకాంక్షతో రాష్ట్రం నలుమూలల నుంచి అన్ని వయస్సుల ప్రజలు తరలివచ్చారు. దీంతో ఉదయం 10 గంటలకే రాజధానికి దారితీసే మార్గాల్లో జన సందోహం కనిపించింది. ట్రాఫిక్‌లో చిక్కుకు పోయిన వివిధ ప్రాంతాల ప్రజలు సాయంత్రం 6 గంటలకు సభ ముగిసిన సమయంలో కూడా ప్రాంగణానికి చేరుకుంటూనే ఉన్నారు. మహిళలు ఎండ తీవ్రతను ఏమాత్రం లెక్క చేయ కుండా అమరావతికి తరలిరావడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది.

వెల్లివిరిసిన.. జాతీయత

రాజకీయ పార్టీల జెండాలకు.. వాటి ఆనవాళ్లకు ఆస్కారం లేకుండా అమరావతి పునర్నిర్మాణ పండుగ జరిగింది. ప్రజలు కూడా మూడు రంగుల జెండాలను ప్రదర్శిస్తూ జాతీయతను చాటారు. ఇక సభ వెలుపల, సభా ప్రాంగణంలో ఎక్కడా ఏ పార్టీ జెండాల ప్రదర్శన లేకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణంలోకి కేవలం మువ్వన్నెల జాతీయ జెండాలను మాత్రమే అనుమతించారు. ప్రధాని నరేంద్ర మోదీ సభావేదిక మీదకు రాగానే ప్రజలు వందేమాతరం అంటూ జెండాలు ఊపుతూ హర్షధ్వానాలు చేస్తూ స్వాగతం పలికారు. అమరావతి రైతులు జయహో.. అమరావతి అంటూ పచ్చ కండుకావాలు గాలిలో ఊపారు. అలానే ప్రధాని హెలిప్యాడ్ మొదలు సుమారు 1.3 కిలోమీటర్ల దూరం పొడవునా సభా ప్రాంగణం వరకు జాతీయ జెండాలతో అలంకరించారు.



తుళ్లూరు(వెలగపూడి), గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణ సభతో అమరావతి జనసంద్రంగా మారింది. ప్రధాని నరేంద్ర మోదీ రూ.58వేల కోట్ల పనుల ప్రారంభోత్సవం చేశారు. ఈ సభ సందర్భంగా రాజధాని గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపించింది. ఆంధ్రుల ఏకైక రాజధాని అమరావతేనంటూ జనాలు నినదించారు. స్థానిక రాజధాని గ్రామాల ప్రజలే కాకుండా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారు కూడా అమరావతికి మద్దతుగా నినాదాలు చేశారు. సభ జరిగే వెలగపూడితో పాటు రాజధాని పరిధిలోని అన్ని గ్రామాల్లోనే అదే వాతావరణం కనిపించింది. రాజధాని మండల కేంద్రమైన తుళ్లూరుతో పాటు పలు గ్రామాల్లో రైతులు, మహిళలు మేళతాళాలతో శుక్రవారం ఉదయం పాదయాత్ర చేస్తూ సభకు తరలి రావాలని ప్రజలను ఆహ్వానించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని అన్ని ప్రాంతాలకు వందల సంఖ్యలో బస్సులు, కార్లు ముందురోజు సాయంత్రానికే చేరుకోగా ఆయా వాహనాల్లో జనం అమరావతికి తరలి వచ్చారు. వారికి ప్రత్యేకంగా భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. వేసవి దృష్ట్యా తాగునీరు, మజ్జిగ ప్యాకె ట్లు అందజేశారు. సభా ప్రాంగణానికి ఆలస్యం గా చేరుకున్న వీఐపీలకు అనుమతి లభించ లేదు. జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్‌అహ్మద్‌లకు వీఐపీ పాసులు ఉన్నా గ్యాలరీ నిండిపోయిందని పోలీ సులు అనుమతించలేదు. సభకు వెళ్లే మార్గాల న్నీ వాహనాలు, జనంతో నిండిపోయాయి. బస్సులు వెలగపూడి వైపు వెళ్లడానికి బారులు తీరడంతో మధ్యాహ్నానికి ట్రాఫిక్ దిగ్బంధనం ఏర్పడింది. సభకు చేరుకోవడానికి 8 మార్గాలను గుర్తించినా, ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి వచ్చే వాహనాలన్నీ మంగళగిరి వైపే వచ్చాయి. విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డును కాజ దగ్గర నుంచి వెలగపూడి సభ కోసం అనుమతించినా చాలామంది కృష్ణాయపాలెం రోడ్డు వైపే వచ్చారు. దీంతో తాడేపల్లి, మంగళగిరి వైపు నుంచి వచ్చే బస్సులన్నీ కృష్ణాయపాలెం జంక్షన్ వద్ద నుంచి ఆగిపోయాయి. ఆ జంక్షన్ నుంచి మందడం సరిహద్దుల్లోని వెస్ట్ బైపాస్ అండర్ పాజ్, ఈ-8 రోడ్డు జంక్షన్ వరకూ బస్సులు నిలిచిపోయాయి. సభానంతరం తిరిగి వెళ్లే సమయంలో కూడా అదే పరిస్థితి పునరావృతమయింది.

మధ్యాహ్నానికే కిటకిట

అమరావతి సభకు జనం పోటెత్తారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా ప్రజలు తరలిరావడంతో సభా ప్రాంగణం మధ్యాహ్నం 12 గంటలకే నిండిపోయింది. ఎండ భగభగ మండుతున్నా జనం వాటిని లెక్క చేయకుం డా తరలివచ్చారు. రాజధాని సమీప జిల్లా లైన ఇటు గుంటూరు, పల్నాడు, అటు ఎన్టీఆర్ విజయవాడ, కృష్ణా జిల్లాల నుంచి భారీగా జనం తరలివస్తారని అంచనా వేయ గా అంతకుమించి జనం పోటెత్తారు. దీంతో వెలగపూడి గ్రామం జనసంద్రాన్ని తలపించింది. గ్యాలరీలన్నీ నిండిపోవడంతో ఆలస్యంగా సభా ప్రాంగణానికి చేరుకున్న వారు రోడ్లపైనే ఉండాల్సి వచ్చింది. పార్కింగ్ ప్రదేశాలతో పాటు ఈ -6, 7, 8 రోడ్ల వరకు, ఎన్-9 రోడ్డు, సచివాలయం చుట్టుపక్కల రోడ్లన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. సభా ప్రాంగణానికి చుట్టుపక్కల కిలోమీటరు మేర ఎటు చూసినా జనమే కనిపించారు.

అన్నిమార్గాలూ.. అమరావతి వైపే

అమరావతి పునర్నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఓ పండుగలా నిర్వహించగా.. రాజధాని సమీప జిల్లావాసులే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి జనం పోటెత్తారు. కలల రాజధాని.. మన అమరావతి.. ఛలో అమరావతి.. జనం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రాజధానికి దారితీసే మార్గాలన్నీ ఉదయం నుంచే వాహనాలు, జనంతో సందడిగా మారాయి. ఇటు తాడికొండ.. అటు మంగళగిరి, తాడేపల్లి రోడ్లపై వాహనాలు బారులు తీరాయి. అమరావతి సభకు వచ్చే వారి కోసం ఎక్కడికక్కడ ప్రత్యేకంగా భోజన, తాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ఆయా ప్రాంతాల్లో పలువురు సేద తీరారు.









ప్రధానికి హెలీప్యాడ్ వద్ద స్వాగతం...



సభకు తరలివస్తున్న విద్యార్థినులు, మహిళలు



గ్యాలరీల బయట మహిళల సందోహం



జాతీయ రహదారిపై బారులు తీరిన వాహనాలు




వెలగపూడిలో పార్కింగ్ స్థలంలో బస్సులు



అద్భుతంగా అమరావతి


పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం


కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు




సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు


మహిళల విజయ దరహాసం

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోందని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ కోలాహలం నెలకొంది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి




దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు


సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు


సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు


గ్యాలరీల బయట జనం

5న తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన

మార్టూరు, మే2 (ఆంధ్రజ్యోతి) : ఏపీటీఎఫ్ మార్టూరు జోన్ బాపట్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో తమ సమస్యల పరిష్కారం కొరకు ఈ నెల 5 వతేదీన సోమవారం సాయంత్రం 4 గంటలకు మండల తహసిల్దారు కార్యాయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టినట్లు రాష్ట్ర కౌన్సిలర్ మాడుగుల కిషోర్ శుక్రవారం ఒ క ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు విరివిగా హాజరుకావాలని ఆయన తన ప్రకటనలో కోరారు.

ఘనంగా శంకరాచార్యులు జయంతి

అద్దంకి,మే2(ఆంధ్రజ్యోతి): ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఆదిశంకరాచార్యులు చిత్రపటం ఏర్పాటు చేసి పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శింగరకొండలోని బ్రహ్మణ నిత్య అన్నదాన సత్రంలో ఆదిశంకరాచార్యులు, రామానుజాచార్యులు చి త్రపటాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. సత్రం కమిటీ అధ్యక్షుడు ఆదిపూడి మోహన్‌రావు, పమిడిఘంటం చం ద్రశేఖర్, ధేనువకొండ సుబ్బారావు, పుట్టంరాజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంగులూరులో...

పంగులూరు, మే 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పంగులూరులో శుక్రవారం ఆదిశంకరాచార్యుల జయంతి వేడుక నిర్వహించారు. స్థాని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజారి ఓంకారశర్మ పర్యవేక్షణలో జయంతి వేడుక జరిగింది. కార్యక్రమంలో రవిచంద్రాచారి, కందుకూరి మల్లికార్జున, ఆత్మలింగాచారి, పలువురు భక్తులు పాల్గొన్నారు. రిపూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా

తిరుమల నుంచి విశాఖ వస్తుండగా ప్రమాదం

తమిళనాడులో పలు పుణ్యక్షేత్రాలనూ దర్శించుకున్న భక్తులు

బాధితులు వైజాగ్, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన వారే

స్వల్పగాయాలతో బయటపడిన ప్రయాణికులు

మార్టూరు, మే 2(ఆంధ్రజ్యోతి) : తిరుమల నుంచి విశాఖకు వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు జాతీయరహదారి పక్కన బోల్తాపడింది. ఈ సంఘటన మార్టూరు మండలం రాజుపాలెం రెస్ట్ ఏరియా సమీపంలో శుక్రవారం వేకువజామున 4 గంటల సమయంలో చోటుచేసుకుంది. ముందు వెళుతున్న లారీ అకస్మాత్తుగా కుడివైపునకు తిరగడంతో, వెనుక నుంచి వస్తున్న బస్సు డ్రైవరు ఒక్కసారిగా బ్రేక్ వేశారు. దీంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కకు ఈడ్చుకుంటూ వెళ్లి ఆరుఅడుగుల గోతిలో పడింది. ఆ సమయంలో బస్సులో 38 మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో దాదాపు మూడొంతుల మంది మహిళలే. వారంతా విశాఖ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన వారు. విషయం తెలియగానే సంఘటనా స్థలానికి మార్టూరు సీఐ శేషగిరిరావు తన సిబ్బందితో వెళ్లారు. వెంటనే హైవే అంబులెన్స్, హైవే మొబైల్ పోలీసులు, 108 వాహనం సిబ్బంది వచ్చి ప్రయాణికులను బయటకు తీశారు. స్వల్పంగా గాయపడిన 13 మంది మహిళలను, ఇద్దరు పురుషులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారిని సమీపంలోని రెస్ట్ ఏరియాకు తరలించారు. శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో పోలీసులు బోల్తాపడిన బస్సును క్రేన్ సహాయంతో బయటకు తీశారు. ప్రయాణికులు బస్సులోని సామాన్లు తీసుకున్నారు. అనంతరం వారందరినీ వైజాగ్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులలో పోలీసులు పంపించారు.


బోల్తాపడిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు


ప్రభుత్వ ఆస్పత్రినుంచి వైద్యం చేయించుకొని బయటకు వస్తున్న మహిళలు

గత నెల 9న విశాఖ నుంచి బయలుదేరి...

గత నెల 9న విశాఖ నుంచి పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలని 38 మంది ప్రయాణికులు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో బయలుదేరారు. భీమలి మండలం ఉప్పాడ, చిట్టివలస, భోగాపురం మండలం గుడివాడ, తూర్పుగోదావరి జిల్లా కాట్రేని కోన మండలం దర్శితిప్ప, అమలాపురం తదితర గ్రామాలకు చెందిన వారు రామేశ్వరం, కంచి, మధుర, అరుణాచలం తదితర పుణ్య క్షేత్రాలను దర్శించుకున్నారు. గురువారం తిరుమల వచ్చి వెంకటేశ్వరుని స్వామిని దర్శించుకున్నారు. రాత్రికి బస్సులో విశాఖకు బయలుదేరగా మార్గమధ్యలో ప్రమాదానికి గురయ్యారు. డ్రైవరు ప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేషగిరిరావు తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

చినగంజాం, మే 2(ఆంధ్రజ్యోతి) : వైద్యశాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ చెప్పారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం సాయంత్రం ఆమె సందర్శించారు. తదనంతరం ఆమె ఎన్‌సీడీ సీడీ 3.0 సర్వేని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలోనే ప్రసవాలు జరిగే విధంగా గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రైవేట్ వైద్యశాల కంటే మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రధానమంత్రి గ్రామీణ యోజన కార్డులపై 65 ఏళ్లు నిండిన వారికి అవగాహన కల్పించి, వారికి కార్డులు అందజేయాలని సూచించారు. వేసవికాలంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ సీడీ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ లలితారాజేశ్వరి, వైద్యాధికారి పి.సాయిశ్రీచరణ్, సూపర్‌వైజర్లు స్వర్ణలత, చిరంజీవి, ఉల్దారాణి పాల్గొన్నారు.


ఎన్‌సీడీ సీడీ 3.0 సర్వేని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో విజయమ్మ

క్రీడా నైపుణ్యాలను మెరుగుపరచాలి

చినగంజాం, మే 2(ఆంధ్రజ్యోతి) : యువ క్రీడాకారులలో కబడ్డీ పట్ల ఆసక్తి పెంపొందించి, వారిలో క్రీడా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడతాయని జిల్లా క్రీడా శాఖాధికారి కే పాల్‌కుమార్ చెప్పారు. స్థానిక బాలకోటేశ్వర స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ వేసవి శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. క్రీడాకారులకు పలు సూచనలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ఆసక్తి కలిగిన క్రీడాకారులు వేసవి శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు, కోచ్ ఎం.గిరిబాబు మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరం ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగుతోందన్నారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులను తయారు చేయడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఖోఖో, వాలీబాల్, హాకీ కోచ్‌లు జె.పవల్, రాధాకృష్ణ, వి.వెంకటయ్య పాల్గొన్నారు.



కబడ్డీ క్రీడాకారులతో డీఎస్‌డీవో పాల్‌కుమార్

అవీఇవీ

శభాష్ ప్రసాద్...

దొరికిన సొమ్ము రూ.1.80 లక్షలు బాధితునికి అందజేత

నిజాయితీ చాటుకున్న టీ బంక్ నిర్వాహకుడు



బాధితునికి నగదును అందజేస్తున్న ఎస్సై మాల్యాద్రి

పర్చూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : పోగొట్టుకున్న నగదును బాధితునికి అప్పగించి నిజాయితీని చాటున్న టీబంక్ నిర్వాహకున్ని పర్చూరు ఎస్సై మాల్యాద్రి అభినందించారు. స్థానిక వైజంక్షన్ సమీపంలో టీ బంక్ వద్ద గురువారం సాయంత్రం ఓ గుర్తు తెలియని వ్యక్తి టీ తాగి సమీపంలో తనతోపాటు తెచ్చుకున్న రూ.1.80 లక్షల నగదుతో ఉన్న బ్యాగును అక్కడే జారవిడిచి వెళ్లిపోయాడు. రాత్రి 10గంటల తరువాత దుకాణం సర్దుకొని ఇంటికి వెళ్లేందుకు సిద్ధమైన ఆలపాటి ప్రసాద్‌కి అక్కడ బ్యాగ్ ఉండటం గుర్తించారు. సమీపంలో ఎవరూ లేకపోవటంతో బ్యాగ్‌ను తెరిచి చూడగా అందులో ఎక్కువ మొత్తంలో నగదు ఉంది. వెంటనే పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. దీనిపై ఎస్సై విచారించగా మొక్కజొన్నల ట్రేడింగ్ కోసం వచ్చిన పొన్నూరుకు చెందిన డొక్కు సీతారామరాజుదిగా తెలిసింది. దీంతో అతనికి సమాచారం అందించారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో బాధితునికి ఆ సొమ్మును అందజేశారు. దీంతో ప్రసాద్‌ను ఎస్సై మాల్యాద్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈకార్యక్రమంలో పఠాన్ సమీర్, సతీష్, లంకా లక్ష్మణ్, రవి పాల్గొన్నారు.

నాగండ్లలో బంగారం చోరీ

ఇంకొల్లు, మే 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగండ్ల గ్రామంలో గురువారం అర్ధరాత్రి ఆవుల వెంకాయమ్మ ఇంట్లో చోరీ జరిగింది. వెంకామయ్మ తన గొలుసు, ఒక జత గాజులు ఇంట్లో అలమరలో పెట్టుకొని బయట వరండాలో నిద్రిస్తుండగా ఇంటి కిటికీ చువ్వలు వంచి లోపలకు జొరబడి వాటిని ఎత్తుకెళ్లారు. దీనిపై ఆమె స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చోరీకి గురైన 4 సవర్ల బంగారు వస్తువులు సుమారు రూ.1.40 లక్షల విలువ ఉంటుందని అంచనా

మోటార్‌సైకిలిస్టుకు గాయాలు

అద్దంకి, మే 2 (ఆంధ్రజ్యోతి) : మోటార్‌సైకిల్ అదుపుతప్పి కల్వర్టుపై నుంచి వాగులో పడటంతో గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... పంగులూరు మండలం కోటపాడుకు చెందిన అయ్యప్ప శుక్రవారం సాయంత్రం మోటార్ సైకిల్‌పై అద్దంకి వస్తుండగా కశ్యాపురం, జార్లపాలెం మధ్య ఉన్న వాగు కల్వర్టుపై నుండి అదుపు తప్పి పడిపోవటంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి అతన్ని ఆటోలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం 108 లో ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

జనకవరంలో సీసీ కెమెరాల ఏర్పాటు

పంగులూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జనకవరం గ్రామంలో ఐదు ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎస్.ఐ వినోద్‌బాబు చెప్పారు. నేర పరిశోధనలో నిఘనేత్రాలుగా సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయన్నారు. 70 వేల వ్యయంతో వీటి ఏర్పాటుకు సహకరించిన గుర్రం ఆదిశేఖర్‌తో పాటు గ్రామస్థులను ఎస్.ఐ. అభినందించారు.

మంచి మార్కులు సాధించడం అభినందనీయం

ప్రభుత్వపాఠశాలల్లో పది విద్యార్థులకు సన్మానం

ఇంకొల్లు, మే 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలోని పదో తరగతి చదివిన విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం అభినందనీయమని మండల విద్యాశాఖాధికారి ఏ శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో అభినందన సభ జరిగింది. మండల స్థాయిలో ప్రథమస్థానం సాధించిన దాసరి నాగపద్మజ(గంగవరం), ద్వితీయ స్థానం సాధించిన దొడ్డి అశ్విని(పావులూరు), తృతీయస్థానం సాధించిన గట్టుపల్లి నిషికాంత్(ఇంకొల్లు)లతో పాటు పాఠశాలల స్థాయిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు పేర్ని సత్యనారాయణ, చిలుకూరి హనుమంతరావు, చెంచయ్య, శివరామకృష్ణప్రసాద్, ఆదినారాయణ, నాగేశ్వరి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మునిసిపల్ షాపుల అద్దె బకాయిలు రూ.28.44.870 లక్షలు

మూడు రోజుల్లోగా బకాయి చెల్లించాలని నోటీసులు!

చీరాల, మే 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఏఆర్ఎం మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్సు మొదటి అంతస్తుకు సంబంధించి లీజుదారుడు జాగర్లమూడి శ్రీనివాసరావు రూ.28.44.870 లక్షలు బకాయి పడ్డారు. ఈ బకాయి అక్టోబరు 2023 నుంచి ఏప్రిల్ 2025 వరకు ఉంది. దీనిపై మూడు రోజుల్లోగా సమాధానం కోరుతూ మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ గత శుక్రవారం నోటీసులు కూడా జారీ చేశారు. ఈ విషయం ప్రస్తుతం సోషల్ మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీనిపై కమిషనర్ వివరణ కోరగా లీజుదారుడు ఇప్పటికే సంప్రదింపులు జరిపినట్లు చెప్పారు. మరో వారంలోగా బకాయి చెల్లించనున్నట్లు తెలిపారు.

అమ్మ ఆశ్రమంలో అన్నదానం

మార్టూరు, మే 2(ఆంధ్రజ్యోతి) : జగద్గురు ఆదిశంకరాచార్యులు జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక అమ్మ ఆశ్రమంలో విశ్వకర్మ సిద్ధు సేవా ట్రస్ట్ ముప్పవరం ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ సిద్ధు వెంకటసుబ్బారావు పేదలకు, వృద్ధులకు అన్నదానం చేశారు. అంతకుముందు శంకరాచార్యులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం కమిటీ అధ్యక్షుడు గుంటుపల్లి చందు పాల్గొన్నారు.

సమయం లేదు యంత్రాంగమా..!





గత వైసీపీ ప్రభుత్వ పాలనలో సాగర్ కాలువలు కనీస మరమ్మతులకూ నోచుకోలేదు. ప్రస్తుతం అవి పూడిక పేరుకుపోయి చిల్లచెట్లు, ముళ్ల పొదలతో దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల రైతులే స్వచ్ఛందంగా చిల్లచెట్లను తొలగించుకొని పంటలకు నీరందేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టాక కాలువలు మరమ్మతులకు తొలిసారి అవకాశం ఏర్పడింది. అందుకు మే, జూన్ నెలల్లో మాత్రమే. ఆ తరువాత వర్షాలు పడితే కాలువల్లో నీటిని విడుదల చేస్తారు. అప్పుడు కాలువల్లో పూడిక తీయటం, అభివృద్ధి చేయటం సాధ్యమయ్యే పనికాదు. తక్షణమే కాలువలకు మరమ్మతులు చేయాల్సిన అవసరాన్ని అధికార యంత్రాంగం పరిగణనలోకి తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. - పర్చూరు

భక్తిశ్రద్ధలతో శ్రీమహాలక్ష్మమ్మ గ్రామ పొంగళ్లు

భారీగా తరలిన భక్తులు

చీరాల, మే 2 (ఆంధ్రజ్యోతి) :



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

స్థానిక నల్లగాంధీ బొమ్మ వద్ద శ్రీమహాలక్ష్మమ్మ వారి గ్రామ పొంగళ్ల వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. సుమారు 300 ఏళ్ల క్రితం ఆలయం కావడంతో ఏటా జరిగే వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణ సంతరించుకుటుంది. అంతేకాకుండా ఆలయ కమిటీ ఏర్పడి కూడా 25వ వసంతాలు అయ్యాయి. ఈక్రమంలో శుక్రవారం కమిటీ ప్రతినిధులు ఆద్యంతం కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనంతరం అన్న సంతర్పణ నిర్వహించారు. కమిటీ ప్రతినిధులు



అలంకరణలో అమ్మవారు

మాట్లాడుతూ ఆలయ కార్యక్రమాలకు వాడరేవు లలితానంత సరస్వతి ఆశ్రమం ఆశీస్సులతో జరుగుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు ఎం.ఈ శంకరరావు, చింతా రమేష్, వాసుబాబు, లక్ష్మయ్య, వాసుదేవరావు, కిషోర్ పాల్గొన్నారు.

కిశోరి బాలికలు చదువు, ఆరోగ్యంపై దృష్టి సారించాలి

పంగులూరు, మే 2(ఆంధ్రజ్యోతి) : కిశోరి బాలికలు చదువు, ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ చెప్పారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో శుక్రవారం కౌమారబాలికల సాధికారత వైపు పయనం అనే అంశంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు వయస్సుతో వచ్చేశారీరక మార్పులకు అనుగుణంగా ఆరోగ్యాన్ని తీర్చిదిద్దుకోవాలన్నారు. ఎ.ఎన్.ఎం. శేషకుమారి,అంగన్‌వాడీలు సుధారాణి, శ్యామల, శ్రీలక్ష్మి, ప్రసన్నకుమారి పాల్గొన్నారు.



ముప్పవరంలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కిషోర బాలికలకు శిక్షణా తరగతులు

ఇంకొల్లు,మే 1,(ఆంధ్రజ్యోతి) : ఐసీడీఎస్ పరిధిలోని ఇంకొల్లు మండల సెక్టార్‌లోని పావులూరు గ్రామంలో కిశోరి బాలికలకు వేసవి శిక్షణా కార్యక్రమాన్ని సీడీపీవో ఝాన్సీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 10వతేదీ వరకు శిక్షణ ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలికలు ఒకరినొకరు పరిచయం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వాణీ,హర్షిత,అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చినగంజాం, మే 2(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను కిశోరి బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఇంకొల్లు ప్రాజెక్ట్ సీడీపీవో టి.ఝాన్సీ చెప్పారు. మండలంలోని సంతరావూరు గ్రామంలో కిశోరి బాలికల వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. బాలికలు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వేసవి శిక్షణ శిబిరాలు శుక్రవారం నుంచి జూన్ 10వ తేదీ వరకు జరుగుతాయని, వారంలో రెండు రోజులు మంగళ, శుక్రవారాల్లో జరిగే శిక్షణ కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ ఉషాకుమారి పాల్గొన్నారు.



చినగంజాంలో ప్రతిజ్ఞ చేస్తున్న సీడీపీవో, అంగన్‌వాడీలు, బాలికలు

రాజధాని పునర్నిర్మాణాన్ని చూసొద్దాం..

ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో భారీగా తరలిన ప్రజలు

చీరాల, మే 2 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని పునర్నిర్మాణ కార్యక్రమాన్ని చూసొద్దామని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలో అధిక సంఖ్యలో టీడీపీ కూటమి నాయకులు, ప్రజలు, పొదుపు సంఘాలు, మెప్మా సిబ్బంది తరలివెళ్లారు. ఈసందర్భంగా వాహనాలకు ఆయన జెండా ఊపి ప్రారంభించారు. రాకపోకల సమయంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఎమ్మెల్యే ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రతీ బస్‌లో ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఆహారం, తాగునీటిని అందుబాటులో ఉంచారు. చీరాల మునిసిపల్ పరిధిలో 20, గ్రామీణం 20, వేటపాలెం మండలంలో 19 బస్‌లు ఏర్పాటు చేశారు. అలాగే సుమారు 50 కార్లు ప్రధానీ మోదీ సభకు కదిలాయి. అధికారులు వసతులకు సంబంధించి పర్యవేక్షించారు.



అమరావతి సభలో మంత్రులు భరత్, స్వామితో మంత్రి రవికుమార్



చీరాలలో బస్‌లకు జెండాలు ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

అమరావతికి తరలిన నేతలు, కార్యకర్తలు

అద్దంకి, మే 2 (ఆంధ్రజ్యోతి) : అమరావతి పనులు పునఃప్రారంభ సభకు అద్దంకి పట్టణం, మండలం నుంచి కూటమి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులతో పాటు సొంత వాహనాలలో వెళ్లారు. అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రత్యేక భోజన, ఇతర ఏర్పాట్లు చేశారు. అమరావతిలో జరిగిన మోదీ సభకు సహచర మంత్రులు భరత్, స్వామిలతో కలిసి విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు.

బల్లికురవ నుంచి...

బల్లికురవ, మే 2 (ఆంధ్రజ్యోతి) : అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి బల్లికురవ మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు శుక్రవారం పెద్దఎత్తున తరలివెళ్లారు. అధికారులు 13 బస్సులను ఏర్పాటు చేశారు. ఉప్పుమాగులూరు, కొమ్మినేనివారిపాలెం, అంబడిపూడి, గుంటుపల్లి, కొప్పెరపాడు, కొణిదెన గ్రామాల నుండి మహిళలు సైతం ఉత్సాహంగా తరలి వెళ్లడం గమనార్హం. ఈ సందర్భంగా పలువురు టీడీపీ మహిళ నేతలు జై అమరావతి అంటు నినాదాలు చేశారు. ఎంపీడీవో కుసుమకుమారి, మండల టీడీపీ నేతలు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు అధికారులు దగ్గర ఉండి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.



పర్చూరులో అమరావతికి బయలుదేరిన నేతలు, ప్రజలు

పంగులూరు నుంచి...

పంగులూరు, మే 2(ఆంధ్రజ్యోతి):అమరావతి పునర్‌నిర్మాణ వేడుకలో పాల్గొనేందుకు మండలంలోని 21 గ్రామాల నుంచి 12 ప్రత్యేక బస్సులు, వందకు పైగా కార్లలో మహిళలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి వెళ్ళారు. వెళ్లిన వారికి అధికారులు అవసరమైన అల్పాహారంతో పాటు భోజన సదుపాయం వంటి ఏర్పాట్లు చేశారు. ముప్పవరం నుంచి బయలుదేరిన వాహనాల ర్యాలీని టీడీపీ నేతలు జెండాఊపి స్వాగతం పలికారు.

మార్టూరులో...

మార్టూరు, మే2 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి మోదీ సభకు మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. మార్టూరులో టీడీపీ కార్యాలయం నుంచి బయలుదేరిన బస్సులకు నాయకులు కామినేని జనార్దన్ జండా ఊపి ప్రారంభించారు. మండలం నుంచి 11 బస్సుల్లో కార్యకర్తలతో పాటు మహిళలు కూడా తరలివెళ్లారు. 75 కార్లు, 150 ద్విచక్రవాహనాలలో నాయకులు తరలివెళ్లారు. అదేవిధంగా యద్దనపూడి మండలంలో 11 బస్సుల్లో, కార్లలో, ద్విచక్రవాహనాలలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మార్టూరు, యద్దనపూడి మండలాల నుంచి తరలివెళ్లిన కార్యకర్తలకు రాజుపాలెం రెస్ట్ ఏరియా వద్ద భోజనాలు ఏర్పాటుచేశారు. అంతేగాకుండా వారికి ఆరోగ్య కార్యకర్తలు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. సీఐ శేషగిరిరావు, ఎస్సై రత్నకుమారి, తహసీల్దారు ప్రశాంతి భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు.

పర్చూరు, కారంచేడు నుంచి...

పర్చూరు/కారంచేడు, మే 2 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు పిలుపు మేరకు అమరావతి పునర్మిర్మాణానికి నియోజకవర్గం నుండి పార్టీ శ్రేణులు, ప్రజలు తరలివెళ్లారు. తొలుత టీడీపీ నాయకులు స్థానిక బొమ్మల సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అలాగే కారంచేడు మండలంలోని స్వర్ణ గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు తిరుములశెట్టి శ్రీహరి సారథ్యంలో మండల ప్రత్యేక అధికారి శ్యాంసన్, ఎంపీడీవో నేతాజీ, తహసీల్దార్ నాగరాజు జెండా ఊపి బస్సులను తరలించారు.

చినగంజాం నుంచి...

చినగంజాం, మే 2(ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల కార్యాలయాల సముదాయం వద్ద అమరావతి వెళ్తున్న వాహనాలకు మండల టీడీపీ అధ్యక్షుడు పొద వీరయ్య జెండా ఊపి ప్రారంభించారు. సంతరావూరు గ్రామంలో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మీ, పెదగంజాంలో టీడీపీ నాయకులు ఆసోది సుబ్బారెడ్డి, రాజుబంగారుపాలెంలో కోకి భాస్కరరెడ్డి, కడవకుదురులో నక్కల వీరరాఘవులు, చల్లా వెంకటరావు, కొత్తపాలెంలో ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, నీలాయపాలెంలో తూమాటి శ్రీనివాసరావు, మున్నంవారిపాలెంలో వెంకటేశ్వరరెడ్డి, సోపిరాల గ్రామంలో చెరుకూరి రాఘవయ్య, టీ.జయరావు, చినగంజాం గ్రామంలో రాయని ఆత్మారావుల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీ సంఖ్యలో బస్సులు, కారుల్లో అమరావతి తరలివెళ్లారు.

ఇంకొల్లు నుంచి...

ఇంకొల్లు,మే 1,(ఆంధ్రజ్యోతి) : అమరావతిలో ప్రదానమంత్రి మోడీ బహిరంగ సభకు ఇంకొల్లు మండలం నుంచి 60 వాహనాల్లో ప్రజలు తరలివెళ్లారు. గ్రామాల నుండి ఒక్కొక్క బస్సును అందుబాటులో ఉంచగా కొంత మంది కార్యకర్తలు, అభిమానులు 50 కార్లలో వెళ్లినట్లు మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు చెప్పారు.

అవీఇవీ

కార్మిక చట్టాలపై అవగాహనతో ప్రయోజనం

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకట వాహిని



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి వెంకట వాహిని

చీరాల, మే 2 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు వారికి సంబంధించిన చట్టాలపై అవగాహన ఉంటే ఎంతో ఉపయోకరమని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకట వాహిని చెప్పారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు శుక్రవారం రామకృష్ణాపురంలోని ఓ ప్రైవేట్ వ్యాపార సంస్థ పరిధిలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కార్మికులంతా జాతి, మతం భేదం లేకుండా మేడే నాడు కార్మికుల దినోత్సవం ఆచరించడం అభినందనీయమన్నారు. సమాన పనికి సమాన వేతనం పొందడం వారి హక్కు అని, లైంగిక వేధింపులు, ఇతర సమస్యల నుంచి రక్షణ పొందేందుకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది రమేష్‌బాబు, రామకృష్ణారెడ్డి, స్నేహ, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు మార్గదర్శకులు 'దాచూరి'



రామిరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రతినిధులు

చీరాల, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేసిన మహనీయులు దాచూరి రామిరెడ్డి అని పలువురు యూటీఎఫ్ ప్రతినిధులు చెప్పారు. శుక్రవారం స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో దాచూరి వర్ధంతి సభ నిర్వహించారు. దీంతో ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇటీవలి పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమంగా రాణించిన 15 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జ్ఞాపికలు, నగదు ప్రోత్సాహం అందజేశారు. కార్యక్రమంలో భిక్షాలుబాబు, వినయ్‌కుమార్, శ్రీనివాసరావు, పాపారావు, సురేష్, రామారావు, నాగేశ్వరరావు, వీరాంజనేయులు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఉప సర్పంచ్ అశోక్, గ్రామస్థులు

పంగులూరు, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకూరు-వలపర్ల గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం భూమి పూజ చేశారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో రామకూరు నుంచి వలపర్ల వరకు కిలోమీటరుకు పైగా బీటీరోడ్డు పనులకు శ్రీకారం చుట్టామని గ్రామ ఉపసర్పంచ్ పెదవల్లి అశోక్ చెప్పారు.

ముళ్లచెట్ల తొలగింపు

బల్లికురవ, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం-గుంటుపల్లి గ్రామాల మధ్య ఉన్న లింక్ రోడ్డులో ముళ్ల చెట్లు దట్టంగా పెరగటంతో ప్రజలు తీవ్రఇబ్బంది పడుతున్నారు. దీంతో ముక్తేశ్వరం గ్రామ పంచాయతీ నిధులతో రోడ్డు మార్జిన్‌లో ఉన్న ముళ్లచెట్లను యంత్రంతో తొలగించారు. వాహనాదారులకు ఇబ్బందులు తొలగిపోయాయని ప్రజలు తెలిపారు. ఈ రోడ్డును గుంటుపల్లి గ్రామం వరకు అభివృద్ధి పరచాలని ముక్తేశ్వరం ప్రజలు కోరుతున్నారు.

100 కేవీ ట్రాన్స్‌ఫారం ఏర్పాటు

పంగులూరులో లోవోల్టేజీ సమస్యకు పరిష్కారం

పంగులూరు, మే 2(ఆంధ్రజ్యోతి): పంగులూరులోని చినమల్లవరం రోడ్డులో శుక్రవారం విద్యుత్ అధికారులు 63 కేవీ ట్రాన్స్‌ఫారం తొలగించి దాని స్థానంలో 100 కేవీ ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేశారు. గత కొన్నేళ్లుగా లోఓల్టేజ్ కారణంగా విద్యుత్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజల సమస్యకు పరిష్కారం లభించింది. విద్యుత్ ఈఈ నల్లూరి మస్తానరావు చొరవతో లో ఓల్టేజ్ సమస్య పరిష్కారమైనట్లు ఏఈ అనిల్‌కుమార్ చెప్పారు. విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ఐదువేల జనాభా కలిగి ఉన్న గ్రామంలో మరో ట్రాన్స్‌ఫారం కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



చినమల్లవరం రోడ్డులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫారం



ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించిన 167-బీజీ జాతీయ రహదారి



నాయుడుపేట-రేణిగుంట ఆరు వరుసల జాతీయ రహదారి



తిరుపతికి 2 గంటలే!

నాయుడుపేట-రేణిగుంట హైవే ప్రారంభం

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని నాయుడుపేట-రేణిగుంట రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. అనేక ఏళ్లుగా ఈ రోడ్డును విస్తరించాలని నెల్లూరు, చిత్తూరు జిల్లాల ప్రజలు చేసిన విన్నపాలకు ఫలితం దక్కింది. నాయుడుపేట నుంచి రేణిగుంట వరకూ 6 వరుసల రహదారిని ప్రధాని మోదీ శుక్రవారం అమరావతి నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. 58.58 కిలోమీటర్ల దూరం అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించిన ఈ రహదారికి రూ.2,510 కోట్లు ఖర్చు చేశారు. ఇటు చెన్నై-కోల్‌కతా హైవే నుంచి అటు పుత్తూరు హైవేకు నూతనంగా నిర్మించిన రోడ్డు కనెక్టివిటీగా మారుతోంది. గతంలో రెండు వరుసల రహదారి ఉండగా వాహనదారులు నరకం చూసేశారు. ఇప్పుడు ఆరు వరుసల రహదారిని అన్ని గ్రామాలకు అనుసంధానం చేస్తూ ప్రతి గ్రామం వద్ద సర్వీసు రోడ్డు నిర్మించారు. మూడు రోడ్ ఓవర్ బ్రిడ్జీలు, ఐదు వెహికల్ అండర్‌పాస్‌లు, ఏడు ఫ్లైవోవర్‌లు, 15 వంతెనల నిర్మాణం పూర్తి చేశారు. నెల్లూరు నుంచి తిరుపతి, బెంగుళూరు ప్రాంతాలకు వెళ్లే జిల్లా వాసులకు ట్రాఫిక్ తిప్పలు తప్పనున్నాయి. మొన్నటిదాకా నాయుడుపేట నుంచి రేణిగుంటకు రెండు గంటల సమయం పడుతుండగా ఇప్పుడు 45 నిమిషాల్లోనే గమ్యం చేరవచ్చు.



పునర్నిర్మాణోత్సవం.. చూసొద్దాం!

రాష్ట్ర రాజధాని అమరావతి పునఃనిర్మాణం పనులకు శుక్రవారం జరిగే శంకుస్థాపన కార్యక్రమాన్ని కనులారా వీక్షించేందుకు జిల్లా నుంచి కూటమి నేతలతోపాటు అభిమానులు భారీగా తరలివెళ్లారు. అమరావతిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ అద్భుత ఘట్టాన్ని వీక్షించేందుకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు తండోపతండాలుగా తరలివెళ్లాయి. టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో మనుబోలు, కావలి, వెంకటాచలం, ఉదయగిరి తదితర ప్రాంతాల నుంచి బస్సులు, వ్యాన్లలో నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు.

పల్లె ప్రగతికి.. హైవే!

ఎన్నో ఏళ్ల మెట్టవాసుల స్వప్నం సాకారమైంది. దుత్తలూరు నుంచి ఉదయగిరి మీదుగా సీతారామపురం వరకు 36.4 కిలోమీటర్ల పొడవున రూ. 360 కోట్ల వ్యయంతో జాతీయ రహదారి (167-బీజీ) రహదారి నిర్మాణం పూర్తయ్యింది. దీంతో శుక్రవారం అమరావతిలో ప్రదాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల వర్చువల్ విధానంలో జాతీయ రహదారిని ప్రారంభించడంతో పల్లెవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మెట్టకు మణిహారం.. 167-బీజీ హైవే
వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని, సీఎం

ఉదయగిరి, మే 2 (ఆంధ్రజ్యోతి) : రహదారుల నిర్మాణం అభివృద్ధికి మార్గాలు. రాకపోకలతోపాటు వృత్తి, వ్యాపారాల అభివృద్ధికి అవి ఎంతగానో దోహదపడతాయి. అందుకు ఉదాహరణే 167-బీజీ హైవే నిర్మాణం. ఈ రహదారి నిర్మాణంతో మెట్ట భూములు ధరలకు రెక్కలొచ్చాయి. గతంలో రహదారికి సమీపంలో ఉన్న భూమి ఎకరం రూ.5 లక్షల నుంచి 7 లక్షలు పలికేది. ప్రస్తుతం రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో ప్రాంతాన్ని బట్టి రూ.25 లక్షల నుంచి 35 లక్షలకు చేరింది. దీంతోపాటు మోకాలిలోతు మార్జిన్లు, సింగిల్‌రోడ్డుతో అవస్థలు ఈ ప్రాంత ప్రజలకు జాతీయ రహదారి నిర్మాణంతో ప్రయాణానికి ఎంతో అనువుగా మారింది.

● 14 నెలల్లో పనులు పూర్తి


167-బీజీ రహదారి పనులు దక్కించుకున్న ఆర్‌కే-ఎంఆర్‌జీఆర్ సంస్థలు 18 నెలల్లో రహదారి పనులు పూర్తి చేయాల్సి ఉండగా 14 నెలల్లోనే పూర్తి చేశారు. ఇందుకుగాను ప్రభుత్వం రూ.360 కోట్లు మంజూరు చేయగా అందులో రోడ్డు నిర్మాణంలో కోల్పోయిన భూములు, నివాసులకు సుమారు రూ.100 కోట్ల పరిహారం చెల్లించారు. దుత్తలూరు సెంటర్‌లో 565 జాతీయ రహదారి మీదుగా ఫ్లైఓవర్ నిర్మాణంతోపాటు వాగులు, వంకలపైనా వంతెనల నిర్మాణం చేపట్టారు. బసినేనిపల్లి సమీపంలో టోల్‌గేట్ ఏర్పాటు చేశారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవం చేయడంతో ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లా వాసులకు ప్రయాణ కష్టాలు తీరాయి.

సోమశిల నుంచి డెల్టాకు నీరు విడుదల

అనంతసాగరం, మే 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లావాసుల తాగునీటి అవసరాల కోసం సోమశిల జలాశయం నుంచి శుక్రవారం నీటిని విడుదల చేశారు. డ్యాంలోని 6వ నెంబరు క్రస్ట్‌గేటు ద్వారా డెల్టా ప్రాంతానికి 1,000 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కాగా జలాశయంలో 51.114 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఉత్తర కాలువకు 30, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● రాళ్లపాడు నుంచి..

లింగసముద్రం : పత్తి సాగు కోసం రాళ్లపాడు ప్రాజెక్టు నుంచి శుక్రవారం నీటిని అధికారులు విడుదల చేశారు. ప్రాజెక్టు డీఈలు ఎం వెంకటేశ్వర్లు, మధుసూదనరావు, ఏఈ జి చంద్రమౌళిలు తమ సిబ్బంది ద్వారా కుడి కాలువకు 60 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 8 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని డీఈ వెంకటేశ్వర్లు రైతులను కోరారు. ఈ నెల 8వ తేదీ వరకు ఈ నీటిని విడుదల చేయనున్నట్లు చెప్పారు.



సోమశిల నుంచి డెల్టా ప్రాంతానికి విడుదలైన నీరు

గ్రామీణ బ్యాంకుల విలీనం

● ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా పేరు మార్పు

ఉదయగిరి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల ప్రజలకు ఏళ్ల తరబడి సుపరిచితమైన గ్రామీణ బ్యాంకులు విలీనం అయ్యాయి. ఆంధ్రప్రగతి గ్రామీణ, వికాస్, సప్తగిరి గ్రామీణ, చైతన్య గోదావరి బ్యాంకులు ఇకపై యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా పేరు మార్చుకుని ఖాతాదారులకు సేవలు అందించనున్నాయి. ఇందులో భాగంగా జిల్లాలోని 86 ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులు కూడా అదే తరహాలో ఖాతాదారులకు సేవలు అందిస్తాయి. మొట్టమొదటగా 1976లో గ్రామీణ ప్రజలకు అందుబాటు ఉండేలా పినాకిని గ్రామీణ బ్యాంకు ప్రారంభమైంది. కాలక్రమేణా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుగా పేరు మార్చుకొని ఏళ్ల తరబడి సేవలు అందిస్తూ వచ్చేది. ప్రస్తుతం ఆ బ్యాంకు ముచ్చటగా మూడవసారి పేరు మార్చుకుని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మార్పు చెందింది. కాగా ఖాతాదారులు ఎలాంటి ఆందోళనలకు గురి కాకుండా, యథావిధిగా సేవలు పొందాలని అధికారులు తెలిపారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

● 16 రహదారుల అభివృద్ధికి రూ.24.72 కోట్లు
● 38.87 కి.మీ కొత్త రోడ్లకు అనుమతులు

నెల్లూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రధానమైన లింకు రోడ్లను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూరల్ డెవలప్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్(ఆర్‌ఐడీఎఫ్) కింద ఈ రోడ్లను బాగు చేసేందుకు అనుమతులు మంజూరు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 557.22 కోట్లతో 402 రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 16 రోడ్లు అభివృద్ధి కానున్నాయి. 38.87 కిలోమీటర్ల మేర కొత్తగా బీటీ రోడ్డు నిర్మించనున్నారు. ఇందుకుగానూ రూ.24.72 కోట్లను కేటాయించారు. కొన్ని ప్రధానమైన లింకు రోడ్లు చాలా కాలం క్రితం వేసినవి కావడంతో దెబ్బతిన్నాయి. గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. ఇటువంటి వాటిని గుర్తించిన పంచాయతీరాజ్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ఆ వివరాలు పంపారు. ఈ క్రమంలో ఆర్‌ఐడీఎఫ్ నిధులతో ఈ ఏడాది చేపట్టనున్న రోడ్ల జాబితాలో 16 రోడ్లు చోటు దక్కించుకున్నాయి. ప్రభుత్వం నుంచి అనుమతులు రావడంతో టెండర్లు పిలిచేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ నెలలోనే టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి వర్షాకాలంలోపు పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ అశోక్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులతో జిల్లాలో 16 ప్రధానమైన రోడ్లను పునఃనిర్మించనున్నట్లు చెప్పారు. టెండర్ ప్రక్రియకు సంబంధించి శనివారం ప్రకటన విడుదల చేస్తామని, ఆ వెంటనే ఎస్టిమేషన్లు పూర్తి చేసి టెండర్లు పూర్తి చేస్తామని వివరించారు.

గిరిజన గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (హరనాథపురం) మే 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పీబీకే పరిమళ ప్రకటనలో కోరారు. గురుకులాల్లో 3, 4వ తరగతి నుంచి 9వతరగతి వరకు 192 సీట్లు మిగిలి ఉన్నట్లు తెలిపారు. కొడవలూరు, కావలి, సర్వేపల్లి, బీఆర్‌పాలెం, ఇందుకూరుపేట, కరేడు, నెల్లూరు, రాపూరులలో ఈ ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 30న ఐటీడీఏ కార్యాలయంలో లాటరీ పద్ధతి ద్వారా సీట్ల భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

ఆహ్లాదానికి 'గ్రామ పుష్కరిణి'

- గ్రామాల్లో చెరువుల అభివృద్ధికి సరికొత్త పథకం
- తొలుత 5 ఎకరాల్లోపు చెరువుల అభివృద్ధి
- ముందుగా ఒక్కో మండలంలో ఒకటి ఎంపిక
- గ్రామస్థులకు ఆహ్లాదకరంగా ఉండేలా రూపకల్పన
- బిల్లుల మంజూరుతో 'గ్రామ కొలనులకూ' ఊతం



కలిగిరిలో నత్తనడకన..

కలిగిరి పెద్దచెరువును 'గ్రామకొలను'కు ఎంపిక చేశారు. రూ.2.15 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రతిపాదించగా రూ.50లక్షలతో మట్టిపనులు పూర్తవడంతో బిల్లులు చెల్లించారు. మరో రూ.15 లక్షలతో అలుగు రివిట్‌మెంట్ పనులు జరగ్గా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నత్తనడకన పనులు జరుగుతుండటంతో కట్టచుట్టూ వేసిన మట్టి ఇటీవల కురిసిన వర్షానికి కొట్టుకుపోయింది. పనుల జాప్యంపై అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

- కలిగిరి, (ఆంధ్రజ్యోతి)

నెల్లూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని చెరువులను అభివృద్ధి చేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు మంచి ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త పథకాన్ని తీసుకొచ్చింది. 'గ్రామ పుష్కరిణి' పేరుతో చెరువులను ఉపాధి హామీ పథకం కింద అభివృద్ధి చేసేందుకు నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు జిల్లా అధికారులకు అందాయి. తొలి విడతగా ఐదెకరాల్లోపు ఉన్న చెరువులను బాగు చేయనున్నారు. ఈ చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తారు. చెరువు లోపలకు వెళ్లేందుకు వీలుగా ఘాట్ నిర్మిస్తారు. అవసరమైన చోట కూర్చునేందుకు వీలుగా బెంచీలు కూడా ఏర్పాటు చేస్తారు. మొదటగా ఒక్కో మండలంలో ఒక చెరువును అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. జిల్లాలో 37 గ్రామీణ మండలాలు ఉండగా వీటిలో 37 చెరువులు ఆహ్లాదకరంగా రూపుదిద్దుకోనున్నాయి. కాగా ప్రస్తుతం అభివృద్ధి చేయాల్సిన చెరువులను గుర్తిస్తున్నట్లు డ్వామా పీడీ గంగా భవానీ చెప్పారు.



రాపూరు చెరువు కట్టపై పూర్తయిన ట్రాక్

● గ్రామ కొలనులకు ఊతం

2022లో అప్పటి కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు 'గ్రామ కొలనుల' పేరుతో జిల్లాలోని కీలకమైన చెరువులను బాగు చేయాలని సంకల్పించారు. ఈ పనులను ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టారు. చెరువు కట్టలను పటిష్ట పరిచి ట్రాక్ ఏర్పాటు చేయడం ప్రధాన ఉద్దేశం. ఉమ్మడి జిల్లాలో 47 చెరువులను రూ.64.37 కోట్లతో అభివృద్ధి చేసేందుకు అనుమతులు మంజూరు చేశారు. అయితే కొన్ని చెరువుల పనులు ప్రారంభం కాలేదు. వీటిని రద్దు చేశారు. మరికొన్ని చెరువుల్లో కొంత పనులు జరిగాయి. ఉదయగిరి చెరువుకు రూ.6.50 కోట్లు ఖర్చు చేశారు .రాపూరు చెరువు పనులను రూ.1.05 కోట్లతో మొదలుపెట్టగా 90 శాతం మేర పనులు పూర్తయ్యాయి. ఈ విధంగా మిగిలిన చెరువుల్లో కూడా పనులు వివిధ దశల్లో ఉన్నాయి. అయితే వైసీపీ హయాంలో బిల్లులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఇటీవల గ్రామ కొలనుల పనులకు బిల్లులు మంజూరవుతున్నాయి. దీంతో మళ్లీ పనులు ఊపందుకోనున్నాయి. ప్రస్తుతం ఇరిగేషన్, డ్వామా అధికారులు పనులు మొదలుపెట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.



'గ్రామ కొలను'లో ఎంపికై పనులు జరగని సంగం ఎర్రచెరువు



'గ్రామకొలను'లో భాగంగా చేపట్టిన పనులు నాసిరకంగా జరగడంతో దెబ్బతిన్న తూర్పుఎర్రబల్లి (గ్రామకొలను) చెరువుకట్ట



జిల్లాకు చేరిన విద్యార్థి మిత్ర కిట్లు

తొలిరోజే 'విద్యార్థి మిత్ర'

- పాఠశాలల ప్రారంభం నాడే పిల్లలకు కిట్లు అందజేత
- జిల్లాకు చేరిన విద్యాసామగ్రి

నెల్లూరు (విద్య), మే 2 (ఆంధ్రజ్యోతి) : ఈ విద్యా సంవత్సరం (2025-26) లో పాఠశాల ప్రారంభించిన తొలిరోజే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, ఏకరూప దుస్తులతోపాటు విద్యా సామగ్రి అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడు తోంది. జిల్లాలోని పాఠశాలలకు అవసర మైన సామగ్రిని భద్రపరిచేందుకు ప్రత్యేక కేంద్రా లను ఏర్పాటు చేయడంతోపాటు జిల్లాస్థాయి కమిటీ ప్రత్యేక పర్యవేక్షణలో అన్నీ తరగతులకు 'డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' పేరుతో విద్యాసామగ్రి పంపిణీకి కిట్లను సిద్ధం చేస్తున్నారు.

● కమిటీల ఏర్పాటు

ప్రభుత్వ పాఠశాలలు తెరిచేనాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయాలన్న లక్ష్యంతో సమగ్రశిక్ష ద్వారా అధికారులతో మండల, జిల్లాస్థాయి కమిటీలను నియమించారు. నుంచి 10వ తరగతి వరకు ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, స్కూల్‌బ్యాగు, 3 జతల యూనిఫాం క్లాత్, బెల్టు, ఒక జత షూ, రెండుజతల సాక్సులు, డిక్షనరీ, వర్క్‌బుక్స్ అందజేయనున్నారు. ఈ కిట్ల ప్రకారం జిల్లాకు 1,61,959 స్కూలు బ్యాగులు, 1,15,480 బెల్టులు, 1,61,959 యూనిఫాంలు, 1,64,721 షూలు, 8,74,740 నోటుపుస్తకాలు, 1,30,870 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు జిల్లాకు ఇప్పటికే కొన్ని చేరిపోగా, మిగిలినవి కూడా చేరుతున్నాయి.

● ప్రత్యేక పర్యవేక్షణ

ప్రతి విద్యార్థికి విద్యాకిట్లు అందేలా ప్రత్యేక పర్యవేక్షణకు కమిటీలు ఏర్పాట య్యాయి. జిల్లాస్థాయి కమిటీలో హెడ్‌గా సమగ్రశిక్ష ఏపీసీ వ్యవహరిస్తుండగా, కన్వీనర్‌గా సీఎంవో, సభ్యులుగా జీసీడీవో, ఎంఐఎస్ కోఆర్డినేటర్, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ నియమితులయ్యారు. వీరంతా జిల్లా, మండల స్థాయిల్లో స్టాక్ పాయింట్లను గుర్తించి వచ్చిన వస్తువుల నాణ్యతను పర్యవేక్షించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తారు. అలాగే మండ లస్థాయి కమిటీలో హెడ్‌గా ఎంఈవో, సభ్యులుగా నలుగురు ఇంజనీరింగ్ సిబ్బంది, ఎంఐఎస్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సీఆర్ఎంటీ, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్‌లు పనిచేస్తూ కిట్లను మండలస్టాక్ పాయింట్లలో భద్రపరిచి స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేసుకుంటారు. ట్రాన్స్‌పోర్టు ద్వారా పాఠశాలలకు కిట్లు చేరవేస్తారు. అనంతరం ఎంఈవో బయోమెట్రిక్ విధానం ద్వారా కిట్లను అందచేస్తారు. అలాగే పాఠశాల కమిటీలో ప్రధానోపాధ్యాయులు, గ్రామసచివాలయం ఎడ్యుకేషన్ అసిస్టెంట్, మహిళా పోలీస్, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు సమక్షంలో విద్యార్థి కిట్లు పంపిణీ చేయాలి. విద్యార్థులతో బయోమెట్రిక్ వేయించి రోజువారి రిపోర్టులను ఎంఈవో, ఇతర అధికారులకు పంపుతారు.

అందరికీ అందజేస్తాం



పాఠశాల ప్రారంభమైన తొలిరోజే ప్రతి విద్యార్థికి కచ్చితంగా విద్యామిత్ర కిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం. వీటికోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీలు విద్యార్థి పూర్తి వివరాలను నమోదు చేసుకోవడంతో పాటు ఒక్క విద్యార్థికి కూడా పెండింగ్ లేకుండా అందిస్తాం. జిల్లాకు వస్తున్న కిట్లలో ఒక్కటి కూడా తగ్గకుండా చూసుకుంటూ, నాణ్యతను పరిశీలించి స్టాక్ పాయింట్లలో భద్రపరుస్తున్నాం. పాఠశాలల వారీగా విభజించి జూన్ 12న విద్యార్థులందరికీ అందచేయనున్నాం.

- వెంకట సుబ్బయ్య, సమగ్రశిక్ష ఏపీసీ

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	122
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	242
కోడిగుడ్ల ధర (100): 460	



అమరావతికి తరలిన మహిళలు

కావలి, మే 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునఃనిర్మాణ కార్యక్రమానికి దేశప్రధాని నరేంద్రమోదీ వచ్చిన సందర్భంగా శుక్రవారం ఉదయం కావలి నుంచి 5 బస్సుల్లో సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులకు చెందిన మహిళలు బయలు దేరి వెళ్లారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమైన ఈ బస్సులను మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ 5 బస్సులలో 250 మంది వరకు తరలి వెళ్లినట్లు కమిషనర్ తెలిపారు.

ప్రమాదభరితంగా కల్వర్టులు!

- నాణ్యతా ప్రమాణాలకు తూట్లు
- మూడేళ్లకే కాంక్రీట్ కనుమరుగు
- వాహనచోదకుల ఆందోళన

అల్లూరు, మే 2(ఆంధ్రజ్యోతి) : లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన కల్వర్టులు అనతి కాలంలోనే ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడడం, ధనార్జనే ధ్యేయంగా కాంట్రాక్టరు నాశిరకంగా పనులు చేపట్టడంతో వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని 19.5 కిలోమీటర్ల రాజుపాలెం-ఇస్కపల్లి రోడ్డు అభివృద్ధికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.33.50 కోట్ల నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచారు. అదే సమయంలో ఎన్నికలు సమీపించడంతో ఆగిన టెండర్ల ప్రక్రియ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో కొనసాగింది. ఈ టెండరు దక్కించుకున్న కాంట్రాక్టరు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ మార్గంలో అల్లూరు నుంచి పైడేరు వరకు సుమారు 7 కల్వర్టులు నిర్మించారు. ఇందుకు ఒక్కో కల్వర్టుకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వెచ్చించారు. ఆ తరువాత నిధులు విడుదల కాకపోవడంతో అర్ధాంతరంగా పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి బాగున్న రోడ్డు కాస్తా మరింత గతుకులుగా మారిపోయింది. కల్వర్టుల వద్ద పరిస్థితి దారుణంగా మారింది. కల్వర్టుల నిర్మాణంలో అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కాంట్రాక్టరు నాణ్యతకు తూట్లు పొడిశారు. దీంతో అవి నిర్మించిన మూడేళ్లకే కాంక్రీటు కొట్టుకుపోయి ఇనుప కమ్ములు బయటపడ్డాయి. దీంతో వాహనచోదకులకు ప్రమాదంగా మారింది. బయటపడిన ఇనుప చువ్వలు విరిగి వాహనాల టైర్లకు దిగబడి టైర్లు పంచర్లు కావడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. కాంట్రాక్టర్ చేతివాటంతో నాశిరకంగా కల్వర్టులను నిర్మించడంతో మూడేళ్లు గడవకముందే కాంక్రీటు కాస్తా కొట్టుకుపోయిందన్న ఆరోపణలు ఉన్నాయి. కమ్ములు బయటపడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు అంటున్నారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా నిర్మించిన కల్వర్టులు రోడ్డు కిందికి వెళ్లిపోతాయని భావించిన కాంట్రాక్టరు ఆ పనులు నాశిరకంగా చేపట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే రోడ్డు నిర్మాణం జరగకపోవడంతో కాంట్రాక్టరు చూపిన చేతివాటం మూడేళ్లు గడవక ముందే బట్టబయలైంది. కల్వర్టుల వద్ద కాంక్రీటు కొట్టుకుపోయి ఇనుప కమ్ములు బయటపడడంతో అల్లూరు పట్టణ పరిధిలోని పాత పెట్రోలు బంకు సమీపంలో నిర్మించిన కల్వర్టు వద్ద ఇటీవల ఓ ప్రముఖ టీవీ ఛానల్ విలేకరి ద్విచక్ర వాహనంపై వెళ్తూ వాహనానికి కమ్ములు తగులుకొని కింద పడిపోయాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలై నెల్లూరులోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఇలాంటి ప్రమాదాలు నిత్యం జరుగుతోన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టులు వద్ద మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.



కాంక్రీటు కొట్టుకుపోవడంతో బయటపడిన ఇనుప కమ్మీలు, (అంతరచిత్రం)లో పైకి లేచి ప్రమాదకరంగా ఉన్న ఇనుప కమ్మీలు

త్వరలో పనులు ప్రారంభిస్తాం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ రహదారి నిర్మాణానికి సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం. నిధులు విడుదల చేయించి త్వరలో పనులు ప్రారంభిస్తాం.

- భరత్‌కుమార్‌రెడ్డి, ఏఈ, రోడ్లు భవనాల శాఖ

న్యూస్ బాక్స్

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

కందుకూరు, మే 2(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించటానికి ఈనెల 3నుంచి 5 వరకు గడువు పొడిగిస్తూ ఆర్ఐవో టీ.వరప్రసాదరావు ఉత్తర్వులు జారీ చేశారని గాయత్రీ విద్యాసంస్థల కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికీ సప్లిమెంటరీ ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇకపై గడువు పొడిగించడం, అపరాధ రుసుముతో ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉండదని ఆర్ఐవో స్పష్టం చేసినందున ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు దత్తాత్రేయస్వామి ఆరాధన

లింగసముద్రం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెర్ల గ్రామ సమీపంలోని మన్నేరు ఒడ్డున వెలసియున్న దత్తాత్రేయ స్వామి ఆరాధన ఈనెల 4వ తేదీన జరగనుంది. ఈ ఆరాధన మహోత్సవానికి ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామి వారిని భక్తులు సందర్శించేందుకు వీలుగా బ్యారికేడ్లు, సిబ్బందిని ఏర్పాటు చేశారు. భక్తులకు మంచినీరు, మధ్యాహ్నం, రాత్రి అన్నప్రసాద వితరణకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ చెప్పారు. రాత్రి పండరి భజన, హరిశ్చంద్ర నాటక ప్రదర్శన, అగ్ని గుండం ప్రవేశం జరుగుతుందన్నారు. ఆరాధన ముందు రోజైన శనివారం సాయంత్రం దత్తమాల ధరించిన సుమారు వెయ్యి మందకి పైగా మాలాధారులు మొగిలిచెర్ల గ్రామంలోని రామాలయం వద్ద స్వామి వారికి పూజలు నిర్వహించి అనంతరం కళశాలతో ఊరేగింపుగా దత్తాత్రేస్వామి ఆలయం వద్దకు వచ్చి స్వామి వారికి అభిషేకాలు నిర్వహిస్తారిన, రాత్రికి అక్కడే ఉండి ఆరాధన మహోత్సవం రోజున పూజలు చేసి 5న పొంగళ్లు పెట్టుకొని, దీక్ష విరమిస్తారని పవని ప్రసాద్ చెప్పారు.

ప్రసన్నుడి ఆలయ మహా ప్రాకారానికి హద్దులు

బిట్రగుంట, మే 2(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ మహాప్రాకార నిర్మాణానికి కావలి డివిజనల్ సర్వేరు శ్రీనివాసులు శుక్రవారం హద్దులు ఏర్పాటు చేశారు. ఆలయానికి మహాప్రాకారం ఏర్పాటు చేయాలన్న కావలి ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి సూచనల మేరకు ఆలయ మాజీ పాలక మండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి సర్వేర్లతో కొండ దిగువన చుట్టుకొలతలు తీయించారు. గిరిప్రదక్షిణ రోడ్డుకు ఆటంకం కలుగకుండా ఆలయ నాలుగు మూలల హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేరు వెంకటేశ్వర్లు. విశ్రాంత ఇంజినీరు గోపీకృష్ణ, స్థానికులు, గ్రామ సర్వేర్లు తదితరులు పాల్గొన్నారు.

కిలో పొగాకు రూ.280

కలిగిరి, మే 2(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 397 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 301 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-73, ఆర్ఆర్-2, సీఆర్-18, జంపింగ్‌లాట్స్-3 కారణాలతో 96 బేళ్ల తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.210, సగటు ధర రూ.250.11గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టి ఇస్సాక్‌స్వరన్‌దత్ తెలిపారు.

అభివృద్ధి పనుల తనిఖీ

కావలి, మే 2(ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరాంలు పరిశీలించారు. స్థానిక వైకుంఠపురంలో రూ.20లక్షలతో జరుగుతున్న అన్నపుగుంట ఆధునీకరణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలన్నారు. ఉదయగిరి రోడ్డులో విట్స్ కళాశాల ఎదురుగా మున్సిపాల్టీ షాపులు నిర్మాణాల కోసం నూతనంగా ఐరన్ వెల్డింగ్‌లతో నిర్మిస్తున్న పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

చలివేంద్రం ఏర్పాటు

కావలి, మే 2(ఆంధ్రజ్యోతి): కావలి తాలూకా పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో కచ్చేరిమిట్ట రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చలవేంద్రాన్ని ఆ అసోసియేన్ అధ్యక్షుడు ఆకుల రమణయ్య శుక్రవారం ప్రారంభించారు. గత మూడేళ్లుగా తమ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పీ.రవికుమార్, జల జనాభయ్య, యేహూరు వెంకయ్య పాల్గొన్నారు.

కుల గణనపై కేంద్రం నిర్ణయం అభినందనీయం

ఉలవపాడు, మే 2 (ఆంధ్రజ్యోతి) : జన గణనలో కుల గణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం అభినందనీయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆవుల నరసింహరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా కుల గణన చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అనేక పర్యాయాలు ఢిల్లీలో ఉద్యమాలు, ధర్నాలు చేపట్టిందన్నారు. ప్రధాన మంత్రి మోదీ కుల గణన చేపట్టనుండడం, బీసీ కుల గణనకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు తెలపడం సంతోషకరమని తెలిపారు.

పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు

- ఎంపీడీవో నరేంద్రదేవ్

వలేటివారిపాలెం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎంపీడీఓ నరేంద్రదేవ్ తెలిపారు. ఎక్కడా అపరిశుభ్రత వాతావరణం లేకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాం. చెత్తను సంపద కేంద్రాలకు తరలిస్తాం.



ఇంటర్వ్యూ

? చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకవస్తారా.

! మండలంలో నిరుపయెగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఉన్నతాధికారులు ఆదేశాలతో ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే పలు పంచాయతీల్లో పలు కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చాం

? దోమల నివారణకు చర్యలు చేపడుతున్నారా.

! గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాం. అంతేకాకుండా అవసరమైన పంచాయతీల్లో ఫాగింగ్ చేసి దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం.

? ఎన్ని రోజులకు వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నారు.

! ప్రతి 15 రోజుల కొకసారి వాటర్ ట్యాంకులు క్లోరినేషన్ చేపట్టి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నాం.

? సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా.

! సచివాలయాలపై నిరంతరం తనిఖీలు చేస్తుండడంతో సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం.

నేటి నుంచి ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలు

లింగసముద్రం, మే 2 (ఆంధ్రజ్యోతి): లింగసముద్రంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకు ఆలయము స్తాబైంది. ప్రతిరోజూ ఉదయం సుప్రభాతం, హోమం, వేదపారాయణం, సాయంత్రం సహస్ర నామార్చన, చక్ర పెరుమాళ్ల గ్రామోత్సవం, స్వామి వారు, అలివేలు మంగతాయారు, పద్మావతిదేవి సమేతంగా వాహనాలంకృతులై గ్రామోత్సవం, రాత్రి 9 గంటలకు హరికథ, నాటక, పాటకచేరి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉభయకర్తలు పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివార్లను రోజుకో వాహనంపై ఊరేగిస్తారు. 10న కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు విరివిగా హాజరై జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.



ఉత్సవాలకు ముస్తాబైన ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం

వైభవంగా కలిశ ప్రతిష్ఠ

కందుకూరు, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముదిరాజ్‌పాలెంలో ఉన్న కోదండరామ స్వామి ఆలయంలో విమానశిఖర కలశం పునః ప్రతిష్ఠ మహోత్సవం, సీతారాముల కల్యా ణోత్సవం శుక్రవారం వైభవంగా జరిగాయి. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా మూడు రోజులుగా వేదపండితులచే హోమాలు, మహాకుంభాభిషేకం నిర్వహించిన అనంతరం కలశ ప్రతిష్ఠ, స్వామి వారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ముదిరాజుపాలెం రామనామస్మరణతో మార్మోగగా పట్టణ ప్రజలు, పురప్రముఖులు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, వడ్లమూడి సురేష్, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, చుండూరి శ్రీను, చక్కా కేశవ, డాక్టరు తన్నీరు మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.



కలశ ప్రతిష్ఠలో వేదపండితులు

పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించిన బుర్రా

కందుకూరు, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరురోడ్డులో ఉన్న కందుకూరు-2 పొగాకు వేలం కేంద్రాన్ని వైసీపీ ఇంచార్జి, కనిగిరి మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ శుక్రవారం సందర్శించి వేలం తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులు, బోర్డు అధికారులతో మాట్లాడి అన్నిబేళ్లకు గిట్టుబాటు ధర లభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కొద్దిశాతం బేళ్లకు అత్యధిక ధర క్వింటాల్‌కు రూ.28వేలు ఇస్తూ మిగిలిన చెక్కులను తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండటంతో పాటు నోబిడ్‌లు, సీఆర్‌లు అధికంగా ఉంటుండటంతో రైతులు వ్యయప్రయాసలకు గురవుతూ నష్టపోతున్నారని తెలిపారు. ఈమేరకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరుతూ బోర్డు అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తోకల కొండయ్య, గంగిరెడ్డి, ఏ. లక్ష్మీనరసింహం, నలమోతు చంద్రమౌళి, ఈదర రమేష్, షేక్ రఫీ తదితరులున్నారు.

ఆక్రమణల తొలగింపుపై హైకోర్టు స్టే

- పామూరు రోడ్డు సర్కిల్ అభివృద్ధికి బ్రేక్ ?

కందుకూరు, మే 2(ఆంధ్రజ్యోతి): పామూరు రోడ్డు సర్కిల్ అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. సర్కిల్ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన ఆక్రమణల తొలగింపులో మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు నిబంధనలు పాటించలేదని, కోర్టు సూచనలను కూడా పాటించలేదని పేర్కొంటూ హైకోర్టు రెండు నెలలపాటు అక్కడ ఎలాంటి పనులు చేపట్టవద్దని స్టే ఉత్తర్వులు జారీ చేసింది. ఆక్రమణల తొలగింపుపై స్థానిక గృహాల యజమానులు మాదాల మోహనరావు, రవీంద్ర తదితరులు కోర్టులో పిటిషన్ వేయడంతో చట్టపరిధిలో ఆక్రమణల తొలగించి సర్కిల్ అభివృద్ధి చేయాలని సూచన చేస్తూ హైకోర్టు ఉత్త ర్వులిచ్చింది. అయితే ఆక్రమణలు ఉన్నట్లు నోటీసులు ఇచ్చిన మున్సిపల్ అధికారులు అక్రమ కట్టడాల కూల్చివేతకు నోటీసులు ఇవ్వాల్సి ఉండగా ఆ నోటీసు ఇవ్వకుండానే పోలీసు బందోబస్తుతో కూల్చివేయించారు. దీనిని సవాల్ చేస్తూ వారు తిరిగి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో రెండు నెలలపాటు అక్కడ ఎలాంటి పనులు, ఆక్రమణల తొలగించరాదని స్టే జారీచేయటంతో పాటు మరోసారి ఉన్నతాధికారులతో సర్వే నిర్వహించి సర్వే నివేదికను కోర్టుకు అందజేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించింది. నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమణల తొలగింపుకు సిద్ధపడ్డ మున్సిపల్ అధికారులు, పోలీసులపై మానవహక్కుల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు చెబుతున్నారు.

గిరిజన బాలికల గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

ఉలవపాడు, మే 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కరేడులో ఉన్న గిరిజన బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 20వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్.వెంకటసుబ్బయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మొత్తం 192 సీట్లు ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. 3వ తరగతిలో 40 సీట్లుకు గాను ఎస్టీ 32, ఎస్సీ 5, బీసీ 2, ఓసీ 1 ఖాళీలు, 4వ తరగతిలో ఎస్టీ 38, 5వ తరగతిలో ఎస్టీ 33, 6వ తరగతిలో ఎస్టీ 32, 7వ తరగతిలో ఎస్టీ 13, 8వ తరగతిలో ఎస్టీ 17, 9వ తరగతిలో ఎస్టీ 10 సీట్లు ఖాళీ ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్టీ గురుకుల పాఠశాల కావడంతో 4 నుంచి 9వ తరగతి వరకు ఏర్పడిన ఖాళీలు ఎస్టీ విద్యార్థులతో మాత్రమే భర్తీ చేయాల్సి ఉన్నందున ఎస్టీలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

దాచూరి జీవితం అందరికీ ఆదర్శం

- యూటీఎఫ్ నేతల ఘన నివాళి

కందుకూరు, మే 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) వ్యవస్థాపకుల్లో ఒకరైన దివంగత మాజీ ఎమ్మెల్సీ దాచూరి రామిరెడ్డి జీవితం ఆదర్శప్రాయమని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం రామిరెడ్డి వర్ధంతి కార్యక్రమం జరిగింది. పలువురు నాయకులు, కార్యకర్తలు రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి పొన్నగంటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కందుకూరు ప్రాంతీయ మండలాల యూటీఎఫ్ నాయకులు దామా కొండపనాయుడు, చిత్తారి వెంకటేశ్వర్లు, మక్కెన రమేష్‌బాబు, గొట్టిపాటి మాధవరావు, ముప్పరాజు కోటేశ్వరరావు, కృష్ణకుమార్, ఓవీ రమణయ్య, ఎం. కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసం కార్యక్రమం ప్రారంభం



కిశోరి వికాసం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, తదితరులు

బిట్రగుంట, మే 2(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని సూపర్ వైజర్ కోటేశ్వరి శుక్రవారం ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో సమయాన్ని వృథా చేసుకోకుండా ఆరోగ్యం, ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్రప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. మే 2వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు కిశోరి వికాసం కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా పోలీసు జయశ్రీ, ఇంచార్జి సూపర్‌వైజర్ సుప్రజ, ఏఎన్ఎం, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ మోహనరావుకు పీహెచ్‌డీ

కందుకూరు, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న కలవకూరి మోహనరావుకు ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం పీహెచ్‌డీ ప్రకటించింది. క్లౌడ్ కంప్యూటింగ్ వాతావరణంలో డీప్ లెర్నింగ్ ఆధారితంగా వర్క్‌లోడ్ అంచనా, వనరుల కేటాయింపు, నమూనాల పనితీరు మెరుగుదల అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు ఈ పీహెచ్‌డీ లభించిందని కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య తెలిపారు. ఈ సందర్భంగా మోహనరావును కళాశాల టెక్నికల్ డైరెక్టర్ కె.విజయ్‌శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ వి.హరిబాబు, సహచర అధ్యాపకులు అభినందించారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



ఉపాధి హామీ పనులకు హాజరైన కూలీల హాజరును పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రత్యూష

కలిగిరి, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపురం, కావలిముస్తాపురం, సిద్ధనకొండూరు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో ప్రత్యూష శుక్రవారం పరిశీలించారు. మస్టర్ల రిజిష్టర్లను పరిశీలించి, పనులు చేస్తున్న మహిళా కూలీలతో మాట్లాడారు. వేసవి దృష్ట్యా ఉపాధి పనుల వద్ద మంచినీరు, మజ్జిగ పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఫామ్‌పండ్స్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేస్తాం

- నిరసన విరమింపజేసిన సూపరింటెండెంట్

కందుకూరు, మే 2(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలను ఈనెల 15వ తేదీలోగా చెల్లించేలా చర్యలు తీసుకుంటానని, వారికి గత కొన్నేళ్లుగా జమకాని పీఎఫ్‌ను కూడా వారిఖాతాల్లో జమ చేయించేలా చూస్తానని ఆసుపత్రి సూపరింటెండెంట్ శకుంతల హామీ ఇచ్చారు. దీంతో మూడు రోజులుగా ఆసుపత్రి వద్ద నిరసన దీక్షలో ఉన్న కార్మికులు శుక్రవారం దీక్షను విమరించారు.



కార్మికులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శకుంతల






పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం



● కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు





● సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు

అద్భుతంగా అమరావతి

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోం దని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



మహిళల విజయ దరహాసం





దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు



సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు



గ్యాలరీల బయట జనం

యథావిధిగా 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

● అర్జీల సమాచారానికి కాల్ సెంటర్ ● కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), మే 2 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఈనెల 5న సోమవారం యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్నీ మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజనల్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని ప్రజలను కోరారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకపోయినా, ఏ దశలో ఉందో సమాచారం కోసమైనా కాల్ సెంటర్ నెంబరుకు 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

నేడు మంత్రి సత్యకుమార్ పర్యటన

వింజమూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం వింజమూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి మంత్రి ప్రారంభిస్తారు. అనంతరం నెల్లూరుకు చేరుకుని జయభారత్ ఆసుపత్రిలో పలు విభాగాలను ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ కేంద్రాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి ప్రారంభిస్తారు. అనంతరం తిరుపతికి బయలుదేరి వెళతారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

నెల్లూరు(విద్య), మే 2 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించ డానికి ఈనెల 3 నుంచి 5వతేదీ వరకు గడువు పొడిగించి నట్లు ఆర్ఐవో టీ వర ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫీజులు సకాలంలో చెల్లించని విద్యార్థుల సౌకర్యార్థం ఇంటర్ బోర్డు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా గడువు పెం చిందని తెలిపారు. కళా శాలల ప్రిన్సిపాళ్లు చొరవ తీసుకుని విద్యా ర్థులు ఫీజులు చెల్లించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

నాకు పెళ్లి వద్దు.. చదివించండి!

● మేయర్‌ను వేడుకున్న గిరిజన బాలిక

నెల్లూరు (హరనాథపురం), మే 2 (ఆంధ్రజ్యోతి) : నాకు పెళ్లి వద్దు.. నన్ను ఎలాగైనా చదివించండి అని నాగుల సునీత అనే గిరిజన బాలిక నెల్లూరు కార్పొరేషన్ మేయర్ స్రవంతిని శుక్రవారం వేడుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి జిల్లా కోటలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికలు)లో 7వ తరగతి పూర్తి చేసి, గత నెల 23వతేదీ వేసవి సెలవులకు ఇంటికి వెళ్లిన నాగుల సునీత అనే గిరిజన బాలికకు తల్లిదండ్రులు బలవంతంగా పెళ్లి చేసిన విషయం తెలిసిందే. ఆ బాలిక ప్రస్తుతం నెల్లూరులోని బాలసదన్‌లో ఉంది. ఈ విషయం ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకున్న గిరిజన (యానాది) విద్యా చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు మేయర్ పోట్లూరి స్రవంతికి తెలియజేశారు. మేయర్ ఆ గిరిజన బాలిక ఉంటున్న బాలసదన్‌కు వెళ్లారు. బాలికతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ బాలిక తనకు పెళ్లి వద్దని.. నేను బాగా చదువుకోవాలని మేయర్ వద్ద బోరున విలపించింది.



గిరిజన బాలికతో మేయర్ స్రవంతి

సునీతను మేయర్ ఓదార్చారు. చదువుకు అండగా ఉంటామని, తల్లిదండ్రులతో మాట్లాడి వేసవి సెలవుల అనంతరం మళ్లీ గురుకుల పాఠశాలలో చేర్పిస్తామని హామీ ఇచ్చారు. చైతన్య వేదిక ఆధ్వర్యంలో బాలికకు రెండు జతల బట్టలు, పండ్లు, తినుబండారాలను అందజేశారు.

మధుసూదనరావు కుటుంబానికి అండగా ఉంటా

● సినీ నటుడు మంచు విష్ణు



మధుసూదనరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సినీహీరో మంచు విష్ణు

కావలి, మే 2(ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడిలో మృతి చెందిన సోమిశెట్టి మధుసూదనరావు కుటుంబానికి తాను అండగా ఉంటానని సినీ నటుడు మంచు విష్ణు భరోసా ఇచ్చారు. శుక్రవారం ఆయన కావలిలోని మధుసూదనరావు నివాసానికి వచ్చి ఉగ్రదాడి ఎలా జరిగిందని తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మా తల్లిగారిది నెల్లూరు జిల్లా అయినందున తాను జిల్లా వాసిగా పరామర్శించడానికి వచ్చానన్నారు. మీ కుటుంబానికి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తెస్తే మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ మేరకు తనతో పాటు తన పీఆర్వో ఫోన్ నెంబర్లు ఇచ్చారు. పిల్లలు ఎంత వరకు చదువుకున్నా వారిని చదివించే బాధ్యతను కూడా తాను తీసుకుంటానని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకుని వారికి ఏమి చేయదలచుకున్నానో చెప్పానని, ఆ విషయం బయటకు చెప్పదలచుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాజీ కౌన్సిలర్ అమరా వేదగిరి, తదితరులు ఉన్నారు.

పల్లె వైద్యానికి సుస్తీ

24 నుంచి సమ్మె చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు

మూతపడ్డ విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు



ఉదయగిరిలోని విలేజ్ హెల్త్ క్లీనిక్

ఉదయగిరి, మే 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణులకు వైద్యసేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లీనిక్‌లను తీసుకొచ్చింది. జిల్లాలో 3 నుంచి 4 వేల జనాభాకు ఒకటి చొప్పున ఈ కేంద్రాలను ప్రారం భించింది. ఒక్కో కేంద్రంలో బీఎస్సీ నర్సింగ్ చదివిన వారిని మల్టీలెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ)గా నియమించింది. వీరు ఒక్కో కేంద్రంలో 14 రకాల వైద్యసేవలు అందజేయాలి. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు వీరికి సహకారం అందిస్తారు. రోజుకు 30 నుంచి 40 మంది రోగులకు వైద్యసేవలందిస్తారు. అయితే ఇన్సెంటివ్ ఇవ్వడంలేదని, వేతనాలు పెంచాలని, పని వత్తిడి తగ్గించాలని ఈనెల 24 నుంచి వీరు ఆందోళన బాటపట్టారు. దీంతో విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు తాళం పడడంతో గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందక పల్లె ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆనారోగ్యానికి గురైన వారు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని పలువురు బాధపడుతున్నారు. సమ్మె చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు విధుల్లో చేరాలని ప్రభుత్వం నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలిసింది. ఈ విషయమై గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శివకల్పనను వివరణ కోరగా ఈనెల 24 నుంచి ఎంఎల్‌హెచ్‌పీలో సమ్మెలో ఉన్నారని, కేంద్రాల్లో ఏఎన్ఎం, ఆరోగ్య కార్యకర్తల ద్వారా రోగులకు సేవలందిస్తున్నామని తెలిపారు.

రామానుజాయనమః

భక్తిశ్రద్ధలతో సమతామూర్తి జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), మే 2 (ఆంధ్రజ్యోతి) : విశిష్ట అద్వైత సిద్ధాంతకర్త, సమతామూర్తి, సంఘ సంస్కర్త భగవద్‌రామానుజాచార్యుల జయంతిని జిల్లాలోని వైష్ణవాలయాల్లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిపారు. నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న రామానుజుల 1008వ జన్మ తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున శ్వేతచత్ర మహోత్సవం, మంగళశాసనోత్సవం, పినాకినీ నది నుంచి తీర్థ సంగ్రహణం జరిగాయి. శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి, భగవద్రామానుజాచార్యులకు ఏకోత్తర సహస్ర (1001) కలశాభిషేకం, తిరుమంజనసేవ కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామ స్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. రాత్రి దాదాపు అరవై అడుగుల విశేష పుష్ప పల్లకీలో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామి, భగవద్రామానుజులు వారికి ఉత్సవం జరిగింది. భారీ విద్యుద్దీపాలంకరణ, మంగళవాయిద్యాలు, బ్యాండు కచేరీ, బాణాసంచా వేడుకలతో ఈ పల్లకీ ఉత్సవం సాగింది. ఆలయం నుంచి రంగనాయకుల పేట, సంతపేట, కేవీఆర్, పెట్రోలు బంకు మీదుగా ఉభయకర్త ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఇంటి వరకు సాగింది. భక్తులు ఇంటింటా కర్పూర నీరాజనాలు అర్పించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.



రంగనాథస్వామి ఆలయంలో పూజలందుకున్న రామానుజాచార్యులు

సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), మే 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో రెండు సర్టిఫికెట్ కోర్సులకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సి పాల్ కే శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్‌లో ఉత్తీర్ణత సాధించిన యువతీ, యువకులకు అసెంబ్లీ ఆపరేటర్-రెఫ్రిజిరేటర్, ఎయిర్ కండిషనర్, సోలార్ పీవీ ఇన్‌స్టాలేటర్ కోర్సుల్లో ఉచితంగా మూడు నెలలు శిక్షణ ఇస్తారన్నారు. ప్రతిభ చూపిన వారికి సర్టిఫికెట్లు అందించి వివిధ పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు కళాశాలలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న బత్తల పద్మావతి

అనాథ బాలల దత్తతను పూర్తి చేయాలి

● రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

నెల్లూరు (హరనాథపురం), మే 2 (ఆంధ్రజ్యోతి) : శిశు గృహాల్లో ఉన్న పిల్లల దత్తతను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అధికారులకు సూచించారు. జిల్లాలో మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దత్తతపై శుక్రవారం నగరంలోని వాత్సల్య అనాథ శరణాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శిశు గృహాల్లోని అనాథ బాలల దత్తతను పూర్తి చేయడానికి అన్నీ శాఖలు సహకరించాలని కోరారు. వన్‌స్టాప్ సెంటర్‌కు ప్రతినెల ఎన్ని కేసులు వస్తున్నాయి?, రిజిస్ట్రేషన్ ఎంత అవుతోంది?, ఎంతమందికి కౌన్సిలింగ్ ఇస్తున్నారు, ఎంత మంది మహిళలకు పునరావాసం కల్పిస్తున్నారనే విషయాలపై కూడా చర్చించారు. ఐసీడీఎస్ పీడీ సువర్ణ మాట్లాడుతూ జిల్లాలో పిల్లల దత్తత విషయంలో ఎటువంటి జాప్యం లేకుండా చూస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ కమిటీ సభ్యులు టీ మాధవి, రాజ్యలక్ష్మి, శ్రీనివాస్, బాలల పర్యవేక్షణ అధికారి బీ సురేష్, జీసీడీవో మమతా తదితరులు పాల్గొన్నారు.

నేలవాలిన వరి పైరు



మండలంలోని గండిపాళెంలో గురువారం రాత్రి ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురవడంతో సాగులో ఉన్న వరి పంట నేలవాలింది. దీంతో ఆరుగాలం కష్టించి సాగు చేసిన వరి పంట చేతికందే సమయంలో నేలవాలడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు పదెకరాల్లో వరి పంట నేలవాలిందని, అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)